Follow: @ANNTELUGU

ANN తెలుగు

# మహా పత్రిక

07-02-2026

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 42 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## బాత్రూమ్ క్లీన్ చేసే కెమికల్స్‌తో కల్తీ నెయ్యి

### శ్రీశైలం ప్రసాదంలో రసాయనాలు

### చంద్రబాబు సంచలన ఆరోపణలు

**కర్నూలు, మహా :** ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంచలన ఆరోపణలు చేశారు. బాత్‌రూమ్‌లో క్లీన్ చేసే కెమికల్స్‌తో చేసిన నెయ్యిని తిరుమలకు సరఫరా చేశారంటూ సంచలన ఆరోపణలు చేశారు. శ్రీశైలం ప్రసాదం తయారీలో కూడా కల్తీ నెయ్యినే ఉపయోగించారంటూ చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి అంశం ఏపీ రాజకీయాలను కుదిపేస్తున్న సమయంలో..చంద్రబాబు శ్రీశైలం ప్రసాదం తయారీపై చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి.

మిగతా 2లో

టాప్ న్యూస్

కోడర్లూ.. ప్రత్యామ్నాయం

### చూసుకోండి

- సాఫ్ట్‌వేర్ డెవలపర్లకు ఏఐతో ముప్పు
- జోహో ఫౌండర్ శ్రీధర్ వెంబు



02

ఎమ్మెల్యేల అనర్హత కేసు

### విచారణ


- మూడు వారాలు వాయిదా వేసిన సుప్రీంకోర్టు



02

### హెచ్ఐవీ కేంద్రంగా పాపులర్ హనీమూన్ ప్రదేశం

బ్లూటూత్ ట్రెండ్‌తో దారుణం



02

# జనసేన.. పెద్దప్లానింగే

**మునిసిపాలిటీతో మొదలు.. జీహెచ్ఎంసి నాటికి శక్తిగా..**

**వచ్చే అసెంబ్లీలో అడుగుపెట్టాలని ఫిక్స్**

**336 వార్డుల్లో పోటీ చేస్తున్న జనసేన**

**కరీంనగర్‌లో 56, నిజామాబాద్‌లో 48 స్థానాల్లో**

**ప్రచారానికి జనసేనాని పవన్ దూరం**

**జీహెచ్ఎంసి సమయంలో రంగంలోకి**


**హైదరాబాద్, మహా:**

జనసేన తెలంగాణలో దూకుడుగానే పోటీచేస్తోంది. మునిసిపల్ బరిలో ఎంట్రీ ఇచ్చి..జీహెచ్ఎంసి నాటికి శక్తిగా మారి, వచ్చే అసెంబ్లీలో ఖచ్చితంగా అడుగుపెట్టాలని ప్లాన్ చేస్తోంది. పెద్ద ప్లానింగ్ తోనే బరిలోకి దిగింది. రాష్ట్రంలో ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ 336 వార్డుల్లో పోటీ చేస్తోంది. జనసేన పార్టీ పోటీ చేస్తున్న స్థానాలపై అధికారికంగా పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఒకేసారి జనసేన పార్టీ ఇన్ని స్థానాల్లో పోటీచేయడం సామాన్యమైన విషయం కాదు. పవన్ కల్యాణ్ మునిసిపల్ ఎన్నికల ప్రచారానికి రావాలని మొదట భావించినా, తెలంగాణ ఆంధ్రలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల్లో ఎన్నికల ప్రచారానికి ఇది సరైన సమయం కాదని భావించినట్లు తెలుస్తోంది. జీహెచ్ఎంసి ఎన్నికల సమయంలో ప్రచారంలోకి దిగితే ప్రభావం బలంగా ఉంటుందన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

## జిల్లాల వారీగా లిస్ట్ ఇదే

జిల్లాల వారీగా తమ పార్టీ అభ్యర్థులు ఎంత మంది పోటీ చేస్తున్నారో పేర్కొంది. అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 56 వార్డుల్లో, అత్యల్పంగా మహబూబాబాద్ జిల్లాలో 5 వార్డుల్లో పోటీ చేస్తోంది. 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా 336 వార్డుల్లో పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, వారి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులు ఆమోదించారని తెలిపింది. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులు గాజు గ్లాస్ గుర్తు పై పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేసింది. జనసైనికులు, వీర మహిళలు పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని విజ్ఞప్తి చేసింది. నిజామాబాద్‌లో 48, కొత్తగూడెంలో 22, రంగారెడ్డిలో 21, ఖమ్మంలో 17, వరంగల్‌లో 20, నల్గొండలో 46, మహబూబ్ నగర్‌లో 44, మహబూబాబాద్‌లో 5, మెదక్‌లో 18, కరీంనగర్‌లో 56, ఆదిలాబాద్‌లో 39 వార్డుల్లో జనసేన పోటీ చేస్తోంది. మునిసిపాలిటీలతో గ్లాసు బోణీ షురూ చేయాలని భావిస్తోంది. సినీనటుడు, యువ హీరో తనీష్ ప్రచారానికి కూడా మంచి స్పందన లభిస్తోంది.





# కల్వకుంట్ల కిషన్ రావుగా కిషన్ రెడ్డి



**అందుకే కేసీఆర్‌ను కాపాడుతున్నాడు**

కిషన్ రెడ్డి కేసీఆర్ కు దత్త పుత్రుడు

కాళేశ్వరం కేసు సీబీఐకి ఇచ్చి ఆర్నెళ్ళయినా చర్యల్లేవ్

బీజేపీ ఎంపీలతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

నిజామాబాద్ సభలో సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

**నిజామాబాద్, మహా:**

లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బీజేపీ చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేటీఆర్, కేసీఆర్‌ను అరెస్టు చేస్తారని కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే ఇంతవరకు అతీ లేదు గతీ లేదని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్‌లను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. అసలు కిషన్‌రెడ్డి కేసీఆర్ ను ఎందుకు కాపాడుతున్నారు? అని ప్రశ్నించిన సీఎం కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని ధ్వజమెత్తారు. కేసీఆర్ దొంగపుత్రుడు కేటీఆర్ దత్తపుత్రుడు కిషన్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. బీజేపీ, బీఆర్ఎస్‌ది ఫెవీకాల్ బంధమని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటు వేస్తే మూసీలో వేసినట్లేనని చెప్పారు. ఎప్పుడో కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి, మీరు కట్టిన ప్రాజెక్టులు ఎలా

మిగతా 2లో

## కేసీఆర్‌కు చిప్పకూడు ఎందుకు తినిపించడం లేదు?

- ఢిల్లీ స్థాయిలో ఒప్పందం వల్లే కేసీఆర్ ను టచ్ చేయట్లే..
- సీఎం రేవంత్ పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజం
- అల్లుడు కూతురు మాట్లాడుకుంటే కూడా విన్న దుర్మార్గుడు కేసీఆర్
- ప్రగతి నిధులు మావి.. పేరు పెత్తనం మీదా?



02



## ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ప్రచార జోరు

కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గల్లీగల్లీలో హోరు

దూసుకుపోతున్న కాంగ్రెస్ అభ్యర్థులు

02

## శ్రీలీల.. దేఖ్ లేంగే

**కర్మన్ ఘాట్ లో మాంగల్య షాపింగ్ మాల్ ప్రారంభం**

**పెద్ద ఎత్తున తరలివచ్చిన అభిమానులు**

**హైదరాబాద్ సిటీ, మహా:** దేఖ్ లేంగే అంటూ కర్మన్ ఘాట్ లో శ్రీలీల డ్యాన్స్ చేస్తూ అభిమానులను ఉత్సాహపరిచింది. కర్మన్ ఘాట్ మాంగల్య షాపింగ్ మాల్ సినీ నటి శ్రీలీలా చేతుల శుక్రవారం మీదుగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉస్తాద్ భగత్ సింగ్ పాటకు సరదాగా డ్యాన్స్ చేసి అభిమానులను ఉత్సాహపరిచారు. మాల్ లో సందడిచేశారు. మాంగల్య షాపింగ్ మాల్ చైర్మన్ నమశివాయ ఈ సందర్భంగా మాట్లాడుతూ మాంగల్య హైదరాబాద్ లో 13వ షాపింగ్ మాల్ ప్రారంభం చేయబడిందని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 28వ షాపింగ్ మాల్ ను ప్రారంభించినట్టు తెలిపారు.






# కేసీఆర్ కు చిప్పకూడు ఎందుకు తినిపించడం లేదు?

**షాద్ నగర్, మహా:** రాష్ట్ర మంత్రులు ఊర్లు పంచుకుని దోపిడీకి పాల్పడుతున్నారని. కేసీఆర్ కు చిప్పకూడు తినిపిస్తా అని పదేపదే అన్న రేవంత్ రెడ్డి రెండున్నర సంవత్సరాలుగా ఏమీ అనకుండా ఉండడానికి కారణం ఢిల్లీ స్థాయిలో రెండు పార్టీల మధ్య ఒప్పందం కుదరడమేనని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణానికి షాద్ నగర్ టౌన్ లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్న కెసిఆర్ పాలన అంతమైందని, కానీ దురదృష్టవశాత్తు తెలంగాణలో కాంగ్రెస్ పాలన మొదలైందని అన్నారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ తోడు దొంగలని అన్నారు. తెలంగాణను రక్షించాలంటే బిజెపిని గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు మూడున్నర లక్షల కోట్లతో హై స్పీడ్ రైలు ఎలివేటర్ కారిడార్ రాబోతుందని అన్నారు. పాలమూరు జిల్లాకు 50 వేల కోట్ల రూపాయల రైల్వే మీద కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఖర్చు పెట్టబోతుందని వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని రియల్ ఎస్టేట్ కంపెనీగా రేవంత్ రెడ్డిమార్చారన్నారు. రాష్ట్రంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వకుండా రెండున్నర సంవత్సరాలుగా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడే భాష మార్చుకోవాలని ఉద్యోగులకు సంబంధించిన ఐదు డిఏలు పెండింగ్లో ఉన్నాయని దోచుకోవడం దాచుకోవడం కాంగ్రెస్ పార్టీ అజెండా అని టిఆర్ఎస్ కారుకు ఉన్న నాలుగు టైర్లకు నలుగురు తీసుకొని తిరుగుతున్నారని అల్లుడు కూతురు మాట్లాడుకుంటే కూడా ఆ మాటలు చాటుగా విన్న దుర్మార్గుడు కేసీఆర్ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

**దోచుకోవడం.. దాచుకోవడమేనా?**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనైనా.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలోనైనా రాష్ట్రాల అభివృద్ధికి ఇచ్చిన నిధులు కేంద్రాన్ని.. పేరు పెత్తనం మాత్రం అప్పుడు బీఆర్ఎస్ ది.. ఇప్పుడు కాంగ్రెస్ ది.. వీళ్లకు దోచుకోవడం, దాచుకోవడం తప్ప మరి ఏది చేతకాదు.. అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై ధ్వజమెత్తారు. ఇన్నేళ్లలో తెలంగాణ వెనుకబాటుకు, తెలంగాణకు జరిగిన అన్యాయానికి ప్రధాన కారణం కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. దేశానికి పట్టిన పీడ కాంగ్రెస్ అని ధ్వజమెత్తారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించి వివాదాలను సృష్టించిందని ఆరోపించారు. ఈ ఎన్నికలు కేవలం మున్సిపాలిటీ ఎన్నికలు మాత్రమే కావని, ఇది తెలంగాణ భవిష్యత్తు అని పేర్కొన్నారు. తెలంగాణను ఎంతో అభివృద్ధి చేశామంటూ ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లు లోకల్ బాడీలకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. షాద్ నగర్ ప్రాంతం గ్రేటర్ హైదరాబాద్ తరహాలో మారాలంటే భారతీయ జనతా పార్టీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో మంత్రులు ఊళ్లను, శాఖలను పంచుకొని ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్లో తెలంగాణకు ఏమీ చేయలేదని కాంగ్రెస్ విమర్శిస్తుందని, హై స్పీడ్ రైల్ ఎలివేటర్ కారిడార్ 300 కోట్ల రూపాయలతో తెలంగాణకు వస్తుందని గుర్తు చేశారు. ఒక్క మహబూబ్నగర్ జిల్లాలోనే అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 50 వేల కోట్లు ఖర్చు పెడుతుందని, అందులో షాద్ నగర్ కు కూడా భాగస్వామ్యం ఉందని అన్నారు. తెలంగాణలో జాతీయ రహదారులను విస్తరించి అత్యద్భుతమైన రవాణా ప్రగతి తీసుకొచ్చిన ఘనత కేంద్ర ప్రభుత్వాన్ని దేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. బిజెపి నేతలు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, కక్కునూరు వెంకటేష్ గుప్తా, డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కల్వకుంట్ల కిషన్ రావుగా కిషన్ రెడ్డి



(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి? అని ప్రతిపక్షంపై ప్రశ్నలు సంధించారు. నిజామాబాద్ జిల్లా బర్ధిపూర్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శం అని కొనియాడారు. నిజామాబాద్ రైతుల పోరాట స్ఫూర్తితో 2028లో ఫైట్ చేస్తాం.. మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అదనపు నిధులు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామని అన్నారు. మహేశ్ కుమార్ గౌడ్ సూచనలతో అభివృద్ధి పనులు చేస్తామని చెప్పారు. రేపు జరుగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేయబోతున్నామని జోస్యం చెప్పారు. రాష్ట్రానికి నిజామాబాద్ గొప్ప నాయకులను అందించిందని గుర్తుచేశారు. నిజామాబాద్ జిల్లా తెలంగాణకు గొప్ప నాయకులను అందించిందని, మున్సిపల్ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలని జిల్లా ప్రజానికాన్ని కోరారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారిందన్న ఆయన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఇందూరుకు ఏం చేయలేదన్నారు. కాళేశ్వరంపై కేంద్రప్రభుత్వం చర్యలు ఏమయ్యాయని బీజేపీని అడుగుతున్నట్లు చెప్పారు.

**ధర్మపురి అర్వింద్ చేసిందేంటి?**

నిజామాబాద్ ఎంపీగా రెండుసార్లు ఎంపీగా గెలిచిన ధర్మపురి అర్వింద్.. ఏం అభివృద్ధి చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటీ చేయలేకపోయిన బీజేపీకి ఎందుకు ఓట్లు వేయాలని అడిగారు. ధర్మపురి అర్వింద్తో పాటు మొత్తం బీజేపీ ఎంపీలతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. నిజామాబాద్ ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే.. కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా అర్వింద్ తీసుకురాలేకపోయాడని విమర్శించారు. ధర్మపురి అర్వింద్తో సహా ఏ ఒక్క బీజేపీ ఎంపీకి కూడా కేంద్ర నేతల దగ్గర బలంగా మాట్లాడే దమ్ము లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ను, కేటీఆర్ను, హరీష్ రావును జైల్లో పెట్టాలని పదే పదే అర్వింద్ డిమాడ్ చేస్తున్నారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలని అడిగారు. సీబీఐ ఎంక్వైరీకి తీర్మానం జరిగి ఆరు నెలలైనా ఎందుకు అరెస్ట్ చేయలేదని ధర్మపురి అర్వింద్ను సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సీబీఐకి ఇస్తే.. కేసీఆర్ను 48 గంటల్లో అరెస్ట్ చేస్తామన్న కిషన్ రెడ్డి ఎక్కడ దాక్కున్నాడని మండిపడ్డారు. ధర్మపురి అర్వింద్కు ప్రధాని మోడీ దగ్గర పరపతి లేదు. ఆయన వల్ల జిల్లాకు కూడా ఏం ఉపయోగం లేదు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే.. అది తప్పకుండా వృథా అవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసే వారికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. గాడిదకు గడ్డి వేసి.. ఆవుకు పాలు పిండితే ఎలా వస్తాయని అడిగారు. మన బస్తీ, మన కాలనీ అభివృద్ధి జరుగాలంటే మనోడే గెలవాలని అన్నారు. సమావేశంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాత్రూమ్ క్లీన్ చేసే కెమికల్స్‌తో కల్తీ నెయ్యి

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లాలో పర్యటించారు. ఎమ్మిగనూరు మండలంలోని కలుగొట్లలో జరిగిన మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమల లడ్డూ విషయాన్ని మరోసారి ప్రస్తావించిన సీఎం చంద్రబాబు.. ఈ క్రమంలోనే మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి ఉపయోగించే నెయ్యిని కల్తీ చేశారన్న చంద్రబాబు.. సీబీఐ, ప్రత్యేక దర్యాప్తు బృందం ఏమీ లేదని చెప్పారంటూ బుకాయిస్తున్నారని అన్నారు. తిరుమల నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని ఎన్‌డీడీబీ నివేదిక ఇచ్చిందని చంద్రబాబు ప్రస్తావించారు. బాత్‌రూములు శుభ్రం చేసే రసాయనాలతో కల్తీ నెయ్యి చేశారంటూ చంద్రబాబు సంచలన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలోనే శ్రీశైలం ప్రసాదం పైనా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. శ్రీశైలం ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిని కూడా కల్తీ చేశారంటూ ఆరోపించారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలకు కల్తీ నెయ్యి సరఫరా చేశారంటూ సంచలన ఆరోపణలు చేశారు. తాను ముఖ్యమంత్రిని అయ్యాక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించామని.. తిరుమల తిరుపతి దేవస్థానం ఈవోను మార్చామని చంద్రబాబు వెల్లడించారు. తిరుమల లడ్డూకు సంబంధించి గతానికి, ఇప్పటికీ వ్యత్యాసం ఉందని చంద్రబాబు వివరించారు.



## కోడర్లూ.. ప్రత్యామ్నాయం చూసుకోండి

**సాఫ్ట్ వేర్ డెవలపర్లకు ఏఐతో ముప్పు**

**జోహో ఫౌండర్ శ్రీధర్ వెంబు**

**మహా:** సాఫ్ట్ వేర్ డెవలపర్లకు కోడర్లకు జోహో సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు కీలక సూచనలు చేశారు. ఏఐ వేగంగా అభివృద్ధి చెందుతున్న దశలో కోడ్ రాసి జీవనోపాధి పొందే వారు ప్రత్యామ్నాయ మార్గాల గురించి ఆలోచించాలని సూచించారు. అనిష్ మూంకా అనే ఇన్వెస్టర్ ఒక్క లైన్ కూడా కోడింగ్ తెలియకుండానే ఏఐ సాయంతో భగవద్గీత యాప్‌ను తయారు చేశారు. అందుకోసం ఏఐని ఎలా వాడిందీ తన ఎక్స్ పోస్ట్ లో చెప్పుకొచ్చారు. దాన్ని కోట్ చేస్తూ శ్రీధర్ వెంబు ఎక్స్ వేదికగా స్పందించారు. భవిష్యత్‌లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉండబోతోందన్న అంశంపై జెమిని ఏఐ ప్రోతో ఆయన సాగించిన సంభాషణను కూడా తన ఎక్స్ పోస్ట్ లో పేర్కొన్నారు. ఏఐ వల్ల భవిష్యత్తులో పోస్ట్ లేబర్ ఎకానమీ రావచ్చని అభిప్రాయపడ్డారు. అందులో మనుషులు జీవితం, కుటుంబం, ప్రకృతి, కళలు, సంగీతం, సంస్కృతి, క్రీడలు, పండుగలు, విశ్వాసం వంటి అంశాలపై మనుషులు దృష్టి పెట్టవచ్చన్న ఆశావహ దృక్పథం వ్యక్తం చేశారు. ఓ వైపు ఆంత్రోపిక్ ఏఐ సంచలనాల నేపథ్యంలో జోహో ఫౌండర్ చేసిన ట్వీట్ మారనున్న ప్రపంచానికి అద్దం పడుతున్నాయి.

# అరవ శ్రీధర్ మామూలోడు కాదు

**మరో ఇద్దరు మహిళలతోనూ.. చాటింగ్ హిస్టరీ బయటపెట్టిన వీణ**

**అమరావతి, మహా :** రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్ వ్యవహారంలో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు జరుగుతున్నాయి. ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిన వీణ వరుసగా వీడియోలు, చాటింగ్ హిస్టరీని బయటపెడుతోంది. ఇవి సంచలనంగా మారాయి. ఇది హనీ ట్రాప్ కాదు.. శ్రీధర్ కళాకారుడు అంటూ పలువురు నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికే వారి వీడియో కాల్స్ కి సంబంధించిన స్క్రీన్ రికార్డింగ్ లు, ఎమ్మెల్యేను కలిసిన సమయంలో తీసుకున్న వీడియోలను బయటపెట్టిన వీణ ఇప్పుడు మరో ఇద్దరు మహిళలతో ఎమ్మెల్యే చేసిన చాటింగ్ హిస్టరీని బయపెట్టింది. అయితే చాటింగ్ చూస్తే సిరి అనే వివాహితతో చేసిన చాటింగ్ లో శ్రీధర్.. మనమిద్దరం పర్సనల్ కలుద్దాం అంటూ అడిగినట్టు ఉంది. అంతే కాకుండా గతంలో వీరిద్దరికీ పరిచయం ఉన్నట్టు కనిపిస్తోంది. శ్రీధర్ తో అవతల మహిళ సైతం క్లోజ్ గానే ఉన్నట్టు చాటింగ్ కనిపిస్తోంది. ఆ మహిళ 10వ తేదీన వస్తావా నేను అమరావతికి వెళుతున్నా.. అంటూ ఆమె చాటింగ్ చేసినట్టు కనిపిస్తోంది. దీంతో రేపు వస్తావా అని ఎమ్మెల్యే రిప్లై ఇవ్వగా హా వస్తాను అంటూ సమాధానం ఇచ్చింది. మీరు ఎమ్మెల్యే కదా నన్ను కలుస్తారా అని అడుగగా ఎమ్మెల్యే.. మీ ఇష్టం అంటూ సమాధానం ఇచ్చాడు. దీంతో అదేంటి నీ ఇష్టం అని అంటున్నావ్.. రమ్మని చెప్పొచ్చుగా అని మెసేజ్ చేయగా నేను ఎలా చెప్తా అంటూ ఎమ్మెల్యే రిప్లై ఇచ్చారు. చంద్రబాబుతో మీటింగ్ ఉన్న విషయాన్ని కూడా శ్రీధర్ మహిళకు చెప్పినట్టు కనిపిస్తోంది. ఇక బెంగళూరుకు చెందిన మరో మహిళతోనూ శ్రీధర్ చాటింగ్ చేసినట్టు కనిపిస్తోంది. ప్రస్తుతం ఎమ్మెల్యే చాటింగ్ కు సంబంధించిన స్క్రీన్ రికార్డింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక ఇప్పటికే ఈ వ్యవహారంపై జనసేన త్రిసభ్య కమిటీ వేయగా శ్రీధర్ ను విచారించింది. ఆ నివేధికను సైతం పవన్ కళ్యాణ్ కు అందించారు. దీంతో అరవశ్రీధర్ ఎపిసోడ్ జనసేనకు తలనొప్పిగా మారింది. తన వ్యక్తిగత వ్యవహారానికి, పార్టీకి సంబంధం లేదని అరవ శ్రీధర్ అంటున్నారు. నిజానిజాలు త్వరలో బమటకువస్తాయంటున్నారు.






## ఎమ్మెల్యేల అనర్హత కేసు విచారణ

**మూడు వారాలు వాయిదావేసిన సుప్రీంకోర్టు**

**ఢిల్లీ, మహా :** తెలంగాణకు చెందిన ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గత విచారణ తర్వాత జరిగిన పరిణామాలను సుప్రీంకోర్టుకు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వివరించారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టుకు తెలిపారు. ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నాయని.. ఈ పిటిషన్లపై విచారణకు మార్చి మధ్య వరకు సమయం ఇవ్వాలని అభిషేక్ సింఘ్వీ కోరారు. దీనికి బీఆర్ఎస్ తరఫు న్యాయవాది మోహిత్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. తొలుత నాలుగు వారాల్లో విచారణను పూర్తి చేస్తామని చెప్పి ఇప్పుడు మళ్లీ సాకులు చెబుతున్నారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువురి వాదనలు విన్న ధర్మాసనం మూడు వారాల సమయం మాత్రమే ఇస్తూ విచారణను వాయిదా వేసింది. గతంలో ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ పాటిస్తారని ఆశిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. మూడు వారాల తర్వాత మళ్లీ విచారణ చేపడతామని పేర్కొంది. స్పీకర్ పాటించని పక్షంలో అప్పుడే ధిక్కరణ చర్యలపై ఆలోచిస్తామని వెల్లడించింది.

## గద్దర్ అవార్డుల వేడుక.. నభూతో అనేలా జరగాలి

**సినీపరిశ్రమలోని అన్ని విభాగాలకు అవార్డులు**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**




**హైదరాబాద్, మహా :** వచ్చే ఉగాది రోజున గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్ కార్యక్రమాన్ని 'న భూతో న భవిష్యతి' అన్న విధంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించాలని, ప్రపంచ ఫిలిం ఇండస్ట్రీ మొత్తం హైదరాబాద్ వైపు తిరిగి చూసేలా ఆ కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందుకు అవసరమైన అన్ని రకాల సహాయ, సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా అందిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రసాద్ లాబ్స్‌లో గద్దర్ ఫిలిం అవార్డుల సందర్భంగా సినిమాల స్క్రీనింగ్ ప్రక్రియ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక మార్పు కోసం కళలను ఉపయోగించి, ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు గద్దర్ అని ఆయన సేవలను డిప్యూటీ సీఎం కొనియాడారు. అందుకే ప్రజా ప్రభుత్వం ఆయన పేరిట సినిమా అవార్డులను ప్రారంభించి, ఇది రెండవ సంవత్సరం అని వివరించారు.

### అందరికీ అవార్డులు

తెలుగు సినీ పరిశ్రమలోని అన్ని విభాగాలకు అవార్డులను ఇవ్వబోతున్నట్లు డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. హైదరాబాద్ కేవలం తెలుగు ఇండస్ట్రీకే కాదు, భారతదేశంలోని వివిధ భాషలకు కేంద్రంగా మారాలని ప్రజాప్రభుత్వం గొప్ప సంకల్పంతో పనిచేస్తుందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉండే వాతావరణ పరిస్థితులు, నిపుణులు, శాంతి భద్రతలు దేశంలోని మరే ఇతర నగరాల్లో లేవని, హైదరాబాద్ మహానగరంలో ఉన్న సానుకూల వాతావరణాన్ని ఉపయోగించుకొని, హైదరాబాదును ప్రపంచ సినీ కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బ్లూ ప్రింట్ తయారు చేసుకుని ముందుకుపోతుందని తెలిపారు.

### అందుబాటులో ఉంటా..

**సినిమా పరిశ్రమకు అవసరమైన ఆర్థిక, సామాజిక, శాంతిభద్రతల పరంగా ఇంకా ఎటువంటి అవసరం అయినా,ఏం సమయంలోనైనా తమ ప్రజా ప్రభుత్వం తలుపు తట్టవచ్చని, సీఎం రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు తాను అందుబాటులో ఉంటామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎఫ్డీసీ చైర్మన్ దిల్ రాజు, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మణిశర్మ, ఎఫ్డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.**



# ఆదిలాబాద్ లో కాంగ్రెస్ ప్రచార జోరు

**కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గల్లీగల్లీలో హోరు**

**దూసుకుపోతున్న కాంగ్రెస్ అభ్యర్థులు**

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ మున్సిపాలిటి అభివృద్ధి చెందాలంటే అన్ని వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కోరారు. మున్సిపల్ ఎన్నికలలో భాగంగా శుక్రవారం 5,6,7,8,10,11వార్డులలో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఆదిలాబాద్ మున్సిపల్ పీఠం హస్తగతం చేసుకునేలా ఓటర్లు ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. మున్సిపల్ పరిధిలోని కాలనీలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని , అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. త్వరలో ప్రతీ మహిళకు 2500 పథకం అమల్లోకి రానుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, 500లకే గ్యాస్ సిలిండర్, 2వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్,కొత్త రేషన్ కార్డులు సన్నబియ్యం పంపిణీ లాంటి మంచి పథకాలతో పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అందుకే ఇంకా మంచి పథకాలు అమలు కావాలంటే ఆదిలాబాద్ అభివృద్ధి చెందాలంటే చేతి గుర్తుకే ఓట వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, మాజీ డీసీసీబి చైర్మన్ అడ్డి భోజరెడ్డి, బాలూరి గోవర్ధన్ రెడ్డి,మాజీ జడ్పిటిసి కొండా గంగాధర్, లోక ప్రవీణ్ రెడ్డి, రంగినేని శాంతన్ రావు, పత్తి ముజ్జు, ప్రభాకర్, ముడుపు ప్రశాంత్, శ్రీలేఖ ఆదివాసీ, ప్రశాంత్,రాం రెడ్డి, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## బ్యాంకు కస్టమర్లకు బిగ్‌షాక్

**ఫిబ్రవరి 15 నుంచి కొత్త ఛార్జీల మోత**

**హైదరాబాద్, మహా:** బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కస్టమర్లకు షాక్ ఇవ్వబోతోంది. ఇమ్మిడియేట్ పేమెంట్ సర్వీస్ నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. ఇప్పటివరకు ఆన్‌లైన్ ద్వారా జరిపే కొన్ని రకాల ట్రాన్సాక్షన్స్‌పై ఉన్న ఉచిత వెసులుబాటును రద్దు చేస్తూ కొత్త సేవా రుసుములను ఫిక్స్ చేసినట్లు వెల్లడించింది. సవరించిన కొత్త ఛార్జీలు ఫిబ్రవరి 15, 2026 నుంచి అమలులోకి వస్తాయని ప్రకటించింది.

**ఛార్జీల వివరాలు :**

- రూ. 25,000 వరకు ఎటువంటి ఛార్జీలూ ఉండవు (ఉచితం)
- రూ. 25,001 నుంచి రూ. 1 లక్ష వరకు రూ. 2 + జీఎస్‌టీ అదనం
- రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు రూ. 6 + జీఎస్‌టీ
- రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు రూ. 10 + జీఎస్‌టీ



## హెచ్ఐవీ కేంద్రంగా పాపులర్ హనీమూన్ ప్రదేశం

**బ్లూటూత్ ట్రెండ్ తో దారుణం**

**మహా :** బ్లూటూత్ ట్రెండ్.. పసిఫిక్ దేశం ఫిజీ ని షాక్ కు గురిచేసింది. పాపులర్ హనీమూన్ స్పాట్‌గా ఉన్న దేశం ఇపుడు హెచ్ఐవీ కేంద్రంగా మారింది. ఈ పరిస్థితిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ విస్మయం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఫిజీలో 2024లో 1583 హెచ్ఐవీ కేసులు నమోదయ్యాయి. 2025లో తొలి ఆరునెలల్లోనే 1,226 కేసులు వెలుగు చూశాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో కేసులు నమోదవుతున్నట్లు ఫిజీ ఆరోగ్య శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. బ్లూటూత్ ట్రెండ్ .. ఈ వైరస్ వ్యాప్తికి కారణంగా తెలుస్తోంది. డ్రగ్స్ కొనుగోలు చేయడానికి డబ్బులు లేనివారు.. కిక్ కోసం అప్పటికే వాటిని తీసుకున్న వ్యక్తుల రక్తాన్ని ఎక్కించుకోవడమే ఈ ట్రెండ్ గా విశ్లేషిస్తున్నారు. సాధారణంగా బ్లూటూత్ ద్వారా డేటాని ఒక ఫోన్ నుంచి మరో ఫోన్‌కి షేర్ చేసినట్టుగానే ఇక్కడ కిక్కుకోసం రక్తాన్ని పంచుకుని హెచ్ ఐ వి పాలయ్యారు. క్రిస్టల్ మెథ్ డ్రగ్ వాడకం ఈ పరిస్థితి కారణమైంది. ఇలా ఒకరి రక్తాన్ని మరొకరు ఎక్కించుకోవడానికి అసురక్షిత పద్ధతులను అనుసరిస్తుండటంతో హెచ్ఐవీ వ్యాప్తి పెరుగుతోంది. ఈ వైరస్ వ్యాప్తిని కట్టడి చేయడానికి వైద్య సదుపాయాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం

**ఇచ్చిన హామీలను విస్మరించి బుకాయిస్తున్న రేవంత్ సర్కార్... బిఆర్ఎస్ పార్టీ శాసనసభ పక్షనేత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు**



**బెల్లంపల్లి, మహా:** ఆచరణకు సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ రెండేళ్ల కాలంలో ప్రజల మద్దతును కూడగట్టుకోలేక,ఇచ్చిన హామీలను విస్మరించి బుకాయిస్తుపాలనను కొనసాగిస్తుందని బిఆర్ఎస్ పార్టీ శాసనసభ పక్షనేత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచార బహిరంగ సభలు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజలను ఇబ్బందుల కు గురి చేస్తుందని అదేవిధంగా రైతుబంధు పథకాన్ని అమలు చేయకపోవడంతో రైతాంగం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అదేవిధంగా సింగరేణిలో అవినీతి పేరుకుపోయి సంస్థ నష్టం వాటిలోల చర్యలు చేపడుతూ పాలన కొనసాగించడం ఎంతవరకు సబబాని ఆయన ప్రశ్నించారు. స్వరాష్ట్ర తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం కేసీఆర్ తీవ్రంగా 14000 శ్రమించి రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి పథంలో నడిపితే రెండో కాలంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని దివానా తీసేలా చర్యలు చేపట్టిందని దుయ్యబట్టారు అదేవిధంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమాని కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల లో టిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన అభ్యర్థులను గెలిపించి పురపాలక సంఘాన్ని సైతం టిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పదేళ్ల పాలనలో కెసిఆర్ రాష్ట్ర అభివృద్ధికి తీవ్రంగా శ్రమించారని ప్రజలు గుర్తించి ఇప్పటికైనా మున్సిపల్ ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీని ఆదరించాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం శ్రమించకుండా కేవలం కేసీఆర్నుభిఆర్ఎస్ పార్టీని దూషించడమే విధిగా ప్రవర్తిస్తూ పాలనను కొనసాగించడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకాలతో ప్రజా సంక్షేమం కోసం లక్ష రూపాయలు బిఆర్ఎస్ పార్టీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు కేసీఆర్ కిట్ ఇచ్చి ఆదుకోవడం జరిగిందని నేడు కాంగ్రెస్ పాలనలో ప్రజా సంక్షేమ పథకాలకు నిర్వీర్యం అయ్యేలా చరమ గీతం పాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పేదింటి మహిళల వివాహాలకు తులం బంగారంతో పాటు లక్ష రూపాయల నగదును ఇస్తామని ఇచ్చిన హామీని నేటికి నెరవేర్చలేక పోయిందని ఇప్పటికైనా ప్రజలు గుర్తించి బీఆర్ఎస్ పార్టీని ఆదరించి మున్సిపల్ ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను గెలిపించి మున్సిపల్ ఎన్నికలలో విజయం సాధించేలా ప్రజలు ఆదరించాలని మరోమారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాల్క సుమన్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బెల్లంపల్లి ఎన్నికల సమన్వయకర్త సుందర్రావు, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూనేటి సత్యనారాయణ, బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బత్తుల సుదర్శన్ తో పాటు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన సచిన్ సావంత్



**ఆదిలాబాద్ మహా :** ఏఐసీసీ కార్యదర్శి మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు సచిన్ సావంత్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఆదిలాబాద్ లో పర్యటించారు. శుక్రవారం పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాసరెడ్డి స్థానిక శ్రేణులతో కలిసి ఆయనకు ఘన స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు. మున్సిపల్ ఎన్నికలలో ప్రచార సరళిపై చర్చించారు.

## బీజేపీ బీఆర్ఎస్ అభివృద్ధి నిరోధక పార్టీలు



- **ప్రెస్ మీట్ లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ విమర్శలు**
- **మతం పేరుతో బీజేపీ విద్వేషాలు**
- **అబద్దాలతో బీఆర్ఎస్ ఆటంకాలు**
- **మున్సిపల్ లో కాంగ్రెస్ కే ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి**

**ఆదిలాబాద్ మహా :** బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు అభివృద్ధి నిరోధక పార్టీలని ఏఐసీసీ కార్యదర్శి మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు సచిన్ సావంత్ అన్నారు. శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఇతర నాయకులతో కలిసి ఆయన ఆదిలాబాద్ పట్టణంలోని హోటల్ పంచవటి లో మీడియాతో మాట్లాడారు. అనవసర అబద్దపు ఆరోపణలతో రెండు పార్టీలు రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని విమర్శించారు. మతం పేరు చెప్పి ఓట్లు అడుగుతున్న బీజేపీ రాముడు వేరని దేశంలోని హిందువుల రాముడు వేరని అన్నారు. రాముడు అందరిని ఒకేలా ఆదరించి ప్రేమతో రామరాజ్య పాలన కొనసాగిస్తే బీజేపీ విద్వేషపూరిత రాజకీయాలతో దేశాన్ని భ్రష్టు పట్టిస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్కరికి డబుల్ బెడ్ రూం ఇవ్వలేదన్నారు. ఆ పార్టీ అంబాసిడర్ కారు ఎప్పుడో మూలకు పడిందని కనీసం రిపేర్ అయ్యేందుకు స్పేర్ పార్ట్స్ కూడా దొరకని పరిస్థితి ఉందని ఎద్దేవా చేసారు. కాంగ్రెస్ పార్టీతో మాత్రమే అభివృద్ధి సాధ్యమని ఆదలాబాద్ పురపాలక ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టాలని విజ్ఞప్తి చేసారు. అటు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ అబ్యర్థులనే గెలిపించాలని కంది శ్రీనివాస రెడ్డి కోరారు.ఆదిలాబాద్ బల్దియా పై కాంగ్రెస్ జెండా ఎగిరేలా ఓటర్లు తమను ఆశీర్వదించాలని కోరారు. ఇక అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ లో సీట్లు కేటాయించినట్లు ముఖ్యంగా సర్వేల ఆధారంగా గెలుపు గుర్రాలకే టికెట్లు ఇచ్చినట్లు డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తెలిపారు. చేతిగుర్తు కే ఓటు వేసి తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఆత్మ చైర్మన్ సంతోష్ రావు,కాంగ్రెస్ నాయకులు సాజిద్ ఖాన్ , గంద్రత్ సుజాత, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, లోక ప్రవీణ్ రెడ్డి, మునిగెల నర్సింగ్, శ్రీలేఖ, సుకేందర్ పాల్గొన్నారు.

## బెల్లంపల్లి గెలుపు దిశగా స్వతంత్ర అభ్యర్థుల ప్రచారం



**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి పట్టణంలో స్వతంత్ర అభ్యర్థులు జరుగుతున్న ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికలప్రచారంలో భాగంగా గెలుపులక్ష్యంగా ముందుకు దూసుకెళ్తున్నారు. ప్రధాన పార్టీలలో బీఫామ్ దక్కకపోవడంతో తమ సేవలను గుర్తించడం లేదని అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలిచారు. గత ఎన్నికల ప్రచారంలో సంబంధిత వార్డులలో సమస్యలను పరిష్కరించలేనివి గుర్తించి తమను గెలిపిస్తే సమస్యలు పరిష్కారంలో ముందు ఉంటామని హామీలు ఇస్తూ ముందుకు సాగుతున్నారు.బెల్లంపల్లి పట్టణంలో 34 వార్డులు ఉండగా ఆయా సంబంధిత వార్డులలో ప్రధాన పార్టీలు అయిన కాంగ్రెస్ బీఆర్ఎస్ బిజెపి పార్టీలకు స్వతంత్ర అభ్యర్థులు గట్టి పోటీలు ఇస్తారు అనడంలో అతిశయోక్తి లేదు...రెండో వార్డులో హోరెత్తిన స్వతంత్ర అభ్యర్థి ప్రచారం..2వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా నిలిచిన వంశీ ప్రచారం శుక్రవారం నాడు హోరెత్తింది. ప్రచారర్యాలీలో బ్యాటు గుర్తుకు ఓటు వేస్తాం..వంశిని భారీ మెజార్టీతో గెలిపించకుంటాం... అనే నినాదాలతో భారీ సంఖ్యలో ర్యాలీని నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బెల్లంపల్లి 2వవార్డులోస్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న నిచ్చకోల వంశీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రచార ర్యాలీ విజయవంతమైంది. వార్డులోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో వందలాది మంది ప్రజలు,యువకులు స్వచ్ఛందంగా పాల్గొని వంశీకృష్ణకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఓటర్ల నుంచి లభిస్తున్న అపూర్వ స్పందన చూస్తుంటే వంశీకృష్ణ విజయం ఖాయమని స్థానిక నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నానని, తన ఎన్నికల గుర్తు అయిన 'బ్యాటు' గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.వార్డు అభివృద్ధి కోసం తపించే వ్యక్తిగా,నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా వంశీకృష్ణ గడప గడపకూ వెళ్లి ఓటర్లను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2వ వార్డులో ఏళ్ల తరబడి నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా వార్డులోని అన్ని వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం,అధునాతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

## ఇందిరమ్మ స్థలాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు**



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల స్థలాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్లాట్ల లబ్ధిదారులు అన్నారు. సదుపాయాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ పంచాయతీ కార్యదర్శి సిహెచ్ . శ్రీకాంత్ గౌడ్ కు లబ్ధిదారులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల స్థలాలు గ్రామ ప్రజలకు 60 గజాల చొప్పున కేటాయించారు. సంవత్సరాలు గడుస్తున్న అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం వల్ల ఇండ్లు నిర్మించుకోవడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఇప్పటికే అక్కడ కొంతమంది ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించుకున్నారని కొన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. మరి కొంతమంది నిర్మించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ తక్షణవసరంగా ప్రజలు స్థిర నివాసం ఏర్పరుచుకొని జీవించడం కోసం కావాల్సిన మంచినీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా ,అంతర్గత మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలన్నారు. వీటితోపాటు ఆ స్థలాన్ని గ్రామకంఠంగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ నీరటి మహేష్ ముదిరాజ్ తో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులతో ఈ అంశంపై చర్చించి అక్కడ ఏ అవసరాలు ఉన్నాయో క్షేత్ర పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పి .శాలిని శ్రీకాంత్ గౌడ్, కనకమామిడి విష్ణు ముదిరాజ్, గూడెపు నీరజ లక్ష్మణ్ రావు, లింగం సంధ్యారాణి నవీన్, కుంచ లతా కుమారి, తొంట జంగమ్మ, పర్వతం వినోద్ కుమార్, చౌట రాజు యాదవ్, బూర్కుంట నాగరాజు, ప్లాట్ల లబ్ధిదారులు బి . పద్మమ్మ, కే. కృష్ణ, బి. దేవేందర్ , పి. జగన్ , కే. శ్రీనివాస్ యాదవ్ ,ఎం.రాజు యాదవ్, కే. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి...

# అభివృద్ధికి సహకరించండి

**చెన్నూరులో మంత్రి వివేక్ వెంకటస్వామి ఎన్నికల ప్రచారం**



**చెన్నూర్ / మంచిర్యాల, మహా :** చెన్నూరు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర కార్మిక మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేకానంద ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం చెన్నూరు మున్సిపాలిటీ 15, 8 వ వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూరులో సమగ్ర అభివృద్ధి ప్రజల సంక్షేమం కావాలంటే 15వ వార్డులో కొమ్మెర విజయలక్ష్మి, ఎనిమిదో వార్డులో సుంకరి శిరీష లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

## మాకు మీకు వారధి కౌన్సిలర్

**భార్గవిరాజును భారీ మెజారిటీతో గెలిపించాలి ఎమ్మెల్యే**

**మున్సిపాలిటీ అభివృద్ధికి మరింత కృషి**






**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**ఎమ్మెల్యేకు ప్రజలకు మధ్య వారధిగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఉంటే గ్రామ అభివృద్ధి మరింత జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, పదవ వార్డు ఖానాపూర్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి భార్గవిరాజు తరపున ఎమ్మెల్యే రంగారెడ్డి పాల్గొని మాట్లాడుతూ... ఎమ్మెల్యేకు ప్రజలకు మధ్య వారధిగా కౌన్సిలర్ ఉండడం జరుగుతుందని, గ్రామంలోని సమస్యల గురించి గానీ, గ్రామ అభివృద్ధి గురించి, ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాల గురించి గానీ గానీ ఎమ్మెల్యేకు తెలియజేయాలంటే కౌన్సిలర్ ఉండాలి. ఆ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉంటే గ్రామ అభివృద్ధి చేసుకోవడానికి మరింత సులువుగా ఉంటుందని ఆయన తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికలలో ఖానాపూర్ గ్రామం నుంచి నాకు భారీ మెజార్టీ అందించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటైన ఈ గ్రామంలో పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి దొంతరమోని రాజుభార్గవిని భారీ మెజారిటీతో గెలిపించాలని గ్రామ ప్రజలను ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలు, అక్రమాల గురించి వివరించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఇప్పటికే వందల కోట్లు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఇప్పుడు జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భార్గవి రాజుకు, ఈనెల 11న జరిగే పోలింగ్లో మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### సుమారు రెండు కోట్లతో అభివృద్ధి....

ఖానాపూర్ గ్రామంలో ఇప్పటికే సుమారు రెండు కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ప్రజలకు తెలియజేశారు గ్రామంలోని కాలనీలలో అండర్ డ్రైనేజ్ రోడ్లు వంటి సమస్యలను తీర్చడం జరిగిందని, ఎప్పటినుంచో ఉన్న జఠిలమైన సమస్యలను కూడా పరిష్కరించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ అభివృద్ధికి తానెప్పుడు ముందుంటానని ఆయన అన్నారు.

## షాద్ నగర్ కు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**షాద్ నగర్. మహా:** షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొనడానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. శుక్రవారం షాద్ నగర్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులను చేశాం. అదే మున్సిపాలిటీకి విజయం అందిస్తుందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 75 నుంచి 80% సీట్లు కాంగ్రెస్ అందుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మహిళా సాధికారికత పేరిట రుణాలు, విద్యా, వైద్య రంగాల్లో పెను మార్పులు, ఉచిత బస్సు, గృహలక్ష్మి పథకాలు. పాలమూరు లాంటి వెనుకబడిన జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలలు, ట్రిబుల్ ఐటీ కళాశాల, ఏకీకృత పాఠశాలల నిర్మాణాలు, రేషన్ కార్డులు, ఉద్యోగాల నియామకాలు ఇలా అన్ని రంగాల లోనూ తమ ప్రభుత్వం సత్తా చాటిందన్నారు. అందుకే ఎక్కడ చూసినా కాంగ్రెస్ కు అనుకూల వాతావరణం కనిపిస్తుందని, అదే కాంగ్రెస్ కు విజయాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీలలో ఏ వార్డుకు వెళ్లిన ప్రజల నుంచి మంచి స్పందన ఉందని, వారి సమస్యలు, కష్టాలు విని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారి సంక్షేమం కోసం ప్రణాళికలు చేపట్టడం జరుగుతుందని మంత్రి వివరించారు. వైద్య రంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నాం. విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాం.. భవిష్యత్తులో అందరికీ అందుబాటులో వైద్యం ఉండేలా వైద్య రంగాన్ని తీర్చిదిద్దుతున్నాం. భవిష్యత్తులో ఏ బాధితుడు కూడా వైద్యం అందుబాటులో లేక మరణించడం జరగదు. అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. షాద్ నగర్ పట్టణంలో 14వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి అందెమోహన్ కు మద్దతుగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఆయన అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి లతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా లక్ష్యంగా వైద్య రంగాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడించారు. బాధితులు వైద్యం కోసం వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు రాకుండా జిల్లా కేంద్రాల్లోనే వైద్యం అందుబాటులో ఉండేలా ఆస్పత్రులను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల సేవ లు అందుబాటులో ఉంటాయన్నారు. వైద్యానికి సంబంధించి సౌత్ సెంట్రల్ గా పాలమూరు జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎవరికి వైద్యం అవసరమైన మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేలా వైద్యాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. అదేవిధంగా కల్ల పరీక్షలకు సంబంధించి ప్రత్యేక కేంద్రం, 80 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉమా కేర్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా మండలాల వారిగా ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఎనిమిదో నిమిషంలో అంబులెన్సులు అందుబాటులోకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

## కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్ లో చేరికలు



**క్యాతన్ పల్లి, మహా :** క్యాతన్ పల్లి మున్సిపాలిటీ ఎన్నికల వేళ పట్టణంలోని పలువార్డులకు చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంచిర్యాల జిల్లా భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు, మాజీ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ సమక్షంలో గులాబి కండువాలు కప్పుకున్నారు.కాంగ్రెస్ పార్టీ 3 వ వార్డుకు చెందిన మహిళా నాయకురాలు నాగుల శారద, 16వ వార్డు కమిటీ నాయకులు వసంత్, జక్కుల శంకరయ్య, మణమ్మ నాయకత్వంలో దాదాపు 200 మంది యుకులు, మహిళలు బాల్క సుమన్ స్వగృహంలో గలాబి కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ 3 వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి కంఠ విజయను భారీ మెజార్టీతో గెలిపించాలని తన పార్టీ శ్రేణులకు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా 16వ వార్డు అభ్యర్థి గండమాల కృపానందం (గ్యాస్ నాని )ను సంపూర్ణ మెజార్టీతో గెలుపించాలని వార్డు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్చార్జీలు, పట్టణ నాయకులు, మహిళ నాయకురాళ్లు, యువకులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపూర్ లో మంత్రి వివేక్ సుడిగాలి ప్రచారం



**క్యాతన్ పల్లి, మహా :** రామకృష్ణాపూర్ పట్టణంలో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద శుక్రవారం మున్సిపాలిటీ ఎన్నికల సుడిగాలి ప్రచారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో 3, 19, 17, 20 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మంత్రి వివేక్ వెంకటస్వామి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి స్థానిక ప్రజలతో మున్సిపాలిటీ అభివృద్ధి, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి క్యాతన్ పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని మంత్రి ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 2 వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిబ్బందికి రాండమైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత భవన సముదాయంలో మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు కె గంగాధర్, జిల్లా విద్యాధికారి యాదయ్య లతో కలిసి మున్సిపల్ ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఒక బృందానికి 1 పి.ఓ., 1 ఎ.పి.ఓ., 3 ఓ.పి.ఓ. ల చొప్పున బెల్లంపల్లి మున్సిపాలిటీకి 68 బృందాలు, చెన్నూరు మున్సిపాలిటీకి 36 బృందాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీకి 45 బృందాలు, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి 30 బృందాలు, మంచిర్యాల నగరపాలక సంస్థకు 265 బృందాలు రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి కేటాయించిన స్థానాలలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని వారికి వెల్లడించారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం బెల్లంపల్లిలో మున్సిపల్ కార్యాలయంలో, చెన్నూర్ లో మున్సిపల్ కార్యాలయంలో, లక్షెట్టిపేటలో మున్సిపల్ కార్యాలయంలో, క్యాతనపల్లిలో మున్సిపల్ కార్యాలయంలో, మంచిర్యాల నగరపాలక సంస్థకు సంబంధించి నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫిబ్రవరి 8, 9 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. సర్వీస్ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగం కోసం ఫారం 12, ఓటరు ఎపిక్ కార్డ్ తీసుకువెళ్లవలసి ఉంటుందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్ లో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 12వ వార్డులో బిజెపికి వెల్లువెత్తుతున్న మద్దతు

**బిజెపి అభ్యర్థి చుక్క అల్లాజీ గౌడ్ విస్తృత ప్రచారం**



**ఆమనగల్లు మహా :** పట్టణంలోని 12 వ వార్డులో బిజెపి పార్టీకి మద్దతు వెలువెత్తుతున్నది. బిజెపి అభ్యర్థి చుక్క అల్లాజీ గౌడ్ ఓటర్ల ఇంటికి ప్రచారంకి వెళ్లిన క్రమంలో సాదరంగా ఆహ్వానిస్తూ ఓటర్లు మద్దతు తెలుపుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. వార్డులోని సమస్యలను తెలుసుకుంటూ వాటి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని ఓటర్లకు హామీ ఇచ్చారు. 12 వార్డులో ఓటర్ల ఆదరణతో ఘన విజయం సాధిస్తానని అల్లాజీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ANN తెలుగు
మహా పత్రిక
శనివారం, హైదరాబాద్
07-02-2026
మహా రాణి




**మహా, ప్రత్యేకం-**

మురికివాడలోని పాడైపోయిన గోడ ఒక రోజు పిల్లల భవిష్యత్తును మార్చగలదని ఎవరైనా ఊహించారా? చాక్ పీస్, బ్లాక్‌బోర్డ్, క్లాస్‌రూమ్ లేకుండానే అక్షరాలు, సంఖ్యలు, శాస్త్రం నేర్పవచ్చని ప్రపంచానికి నిరూపించిన భారతీయ ఉపాధ్యాయురాలు రూబుల్ నాగి . ఆమె ఆలోచనలకే కాదు, ఆచరణకు దక్కిన గౌరవం ప్రపంచానికి భారతదేశ సత్తాను మరోసారి నిరూపించింది. విద్య అంటే కేవలం పాఠశాల గోడల మధ్యనే కాదు, సమాజంలోని చివరి పిల్లవాడి దగ్గరకు చేరాల్సిందే అన్న నమ్మకంతో పనిచేసిన ఓ భారతీయ ఉపాధ్యాయురాలు ప్రపంచ స్థాయి గౌరవాన్ని అందుకున్నారు. దేశవ్యాప్తంగా వందలాది లెర్నింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, స్లమ్ ప్రాంతాల గోడలనే తరగతి గదులుగా మార్చిన సామాజిక కార్యకర్త, టీచర్ రూబుల్ నాగి ప్రతిష్ఠాత్మక గ్లోబల్ టీచర్ ప్రైజ్ 2025ను సొంతం చేసుకున్నారు. ఫిబ్రవరి 5, 2026న దుబాయ్‌లో జరిగిన వరల్డ్ గవర్నమెంట్స్ సమ్మిట్‌లో, ప్రపంచ నేతలు, విధానకర్తల సమక్షంలో రూబల్ నాగి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. వార్కీ ఫౌండేషన్, యెనెస్కో సంయుక్త ఆధ్వర్యంలో జెమ్స్ ఎడ్యుకేషన్ నిర్వహించే ఈ అవార్డు, ప్రపంచంలోనే అత్యున్నత ఉపాధ్యాయ గౌరవంగా గుర్తింపు పొందింది. 2015లో ప్రారంభమైన ఈ పురస్కారాన్ని అందుకున్న పదవ ఉపాధ్యాయురాలుగా రూబల్ చరిత్ర సృష్టించారు.

## రూ.9 కోట్లకుపైగా నగదు కూడా...

ఆ అవార్డుతో పాటు ఆమెకు 1 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 9 కోట్లు పైగా) నగదు బహుమతిగా లభించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నాయకులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతల సమక్షంలో రూబుల్ నాగి ఈ అవార్డును స్వీకరించారు. ఆమె చేసిన సేవలను అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసించారు. ముంబయికి చెందిన రూబుల్ నాగి స్థాపించిన రూబుల్ నాగి ఆర్ట్ ఫౌండేషన్ ద్వారా దేశంలోని వెనుకబడిన వర్గాల పిల్లల కోసం ఇప్పటివరకు 800కి పైగా లెర్నింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పాఠశాలకు ఎప్పుడూ వెళ్లని పిల్లలకు ప్రాథమిక విద్య అందించడమే కాకుండా, ఇప్పటికే చదువుతున్న పిల్లలకు అదనపు బోధన కూడా అందిస్తున్నారు. పేదరికం, పరిస్థితుల కారణంగా చదువుకు దూరమైన పిల్లల్లో మళ్లీ విద్యపై ఆసక్తి కలిగించడం ఆమె లక్ష్యంగా పెట్టుకున్నారు.

# విశ్వవేదికపై భారతీయ మహిళ సత్తా

### మురికివాడల నుంచి ప్రపంచ శిఖరానికి..

### ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన రూబుల్ నాగి..

### ముంబై టీచర్ కు రూ.9 కోట్ల గ్లోబల్ ప్రైజ్

### -'లివింగ్‌వాల్స్‌ఆఫ్‌లెర్నింగ్'-గోడలపైజ్ఞానం

ఆమె బోధనలో సృజనాత్మకతకు పెద్దపీట వేస్తారు. స్లమ్ ప్రాంతాల్లోని గోడలపై అక్షరాలు, గణితం, విజ్ఞానం, చరిత్ర అంశాలతో విద్యా మురళీలు చిత్రిస్తూ వాటినే బ్లాక్‌బోర్డులుగా మార్చేశారు. పిల్లలు ఆ చిత్రాలను చూస్తూ నేర్చుకునేలా ప్రత్యేక పద్ధతిని అమలు చేస్తున్నారు. దీంతో చదువు ఒక భారం కాకుండా సరదాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రూబల్ పనిలో అత్యంత విప్లవాత్మక ఆలోచన "లివింగ్ వాల్స్ ఆఫ్ లెర్నింగ్". పాడుబడ్డ గోడలపై వేసిన రంగుల కుడ్య చిత్రాలు ఇప్పుడు అక్షరాస్యత, గణితం, సైన్స్, పరిశుభ్రత, చరిత్ర, పర్యావరణ అవగాహన నేర్పే గురువులయ్యాయి. ఈ గోడలు పిల్లలతో పాటు తల్లిదండ్రులు, స్థానిక సమాజాన్నీ అభ్యాసంలో భాగస్వామ్యం చేస్తున్నాయి. పేదరికం, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, అనియమిత హాజరు, మౌలిక వసతుల కొరత ఇవన్నీ కేవలం గణాంకాలు కావని, నేలమీద ఉన్న వాస్తవాలని రూబల్ గుర్తించారు. అందుకే అనువైన సమయాలు, పునర్వినియోగ వస్తువులతో ప్రత్యక్ష అభ్యాసం, జీవితానికి పనికొచ్చే నైపుణ్యాలతో విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు.

### నా వెంట నడిచిన ప్రతి చిన్నారిది

అవార్డు అందుకున్న అనంతరం రూబుల్ నాగి మాట్లాడుతూ, "ఈ బహుమతి నాదే కాదు, నా వెంట నడిచిన ప్రతి చిన్నారి, ప్రతి వాలంటీర్‌ది. ఈ డబ్బును మరింత మంది యువతకు ఉపయోగపడేలా వినియోగిస్తాను" అని తెలిపారు. ముఖ్యంగా ఉచిత వృత్తి విద్య (వొకేషనల్ ట్రైనింగ్) అందించే ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని ఆమె నిర్ణయించారు. పేద కుటుంబాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమని వెల్లడించారు.

### లక్ష మందిలో ఒకరిగా ఎంపిక


వర్కీ ఫౌండేషన్, యునెస్కో సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీకి ప్రపంచవ్యాప్తంగా లక్షకు పైగా నామినేషన్లు వచ్చాయి. వాటన్నింటినీ కాదని రూబెల్ నాగి ఈ విజేతగా నిలవడం విశేషం. "ఈ గౌరవం నాపై బాధ్యతను పెంచింది. ప్రతి చిన్నారికి చదువు అందే వరకు నా ప్రయాణం కొనసాగుతుంది" అని ఆమె ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు.

### అవార్డు ఎవరిచ్చారు?

ఈ గ్లోబల్ టీచర్ ప్రైజ్‌ను వార్కీ ఫౌండేషన్ అందజేస్తోంది. విద్యారంగంలో అసాధారణ సేవలు చేసిన ఉపాధ్యాయులను గుర్తించి ప్రోత్సహించేందుకు 2015 నుంచి అవార్డును ఇస్తోంది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సన్నీ వార్కీ స్థాపించిన జెమ్స్ ఎడ్యుకేషన్ ప్రపంచంలోని అతిపెద్ద ప్రైవేట్ స్కూల్ నెట్‌వర్క్‌లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇప్పటివరకు ఆ అవార్డు అందుకున్న వారిలో కెన్యాలో పేదలకు తన జీతంలో ఎక్కువ భాగం దానం చేసిన ఉపాధ్యాయుడు, పాలస్తీనాలో విద్యార్థులకు అహింస బోధించిన టీచర్, కెనడాలో ఆర్కిటిక్ ప్రాంతంలోని ఇన్యుట్ పిల్లలకు బోధించిన విద్యావేత్తలు ఉన్నారు.

### విద్య ద్వారా సమాజ మార్పు సాధ్యం

గత ఏడాది సౌదీ అరేబియాకు చెందిన మన్‌సూర్ అల్ మన్‌సూర్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఇప్పుడు ఆ



జాబితాలో భారతదేశానికి చెందిన రూబుల్ నాగి చేరడం గర్వకారణం. విద్య ద్వారా సమాజ మార్పు సాధ్యమని ఆమె నిరూపించారు. సాధారణ తరగతి గదులు లేకపోయినా, గోడలే బ్లాక్‌బోర్డులైనా, సంకల్పం ఉంటే విద్య అందరికీ చేరుతుందనే సందేశాన్ని ఆమె ప్రపంచానికి చాటి చెప్పారు. రూబుల్ నాగి కథ ఇప్పుడు లక్షలాది ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.





# ఎలక్షన్లు తెచ్చాయి ఓటర్లకు ఉపాధి


**వేములవాడ,మహా:** వేములవాడ మున్సిపల్ ఎన్నికలతో రాజకీయాలతో పాటు ప్రజల జీవనాధారాలకు ఊపొచ్చిందిఎన్నికలతో పట్టణమంతా రాజకీయ మేళావేములవాడ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఎన్నికలు పట్టణానికి కొత్త ఊపునిచ్చాయి. 28 వార్డుల వ్యాప్తంగా అభ్యర్థులు ప్రచారంలో బిజీగా మారడంతో వేములవాడ మొత్తం ఒక రాజకీయ మేళాను తలపిస్తోంది. ప్రతి గల్లీ, ప్రతి కాలనీ ప్రచార వేదికగా మారి, పట్టణ జీవనం ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. ఈ రాజకీయ హడావుడి మధ్య సామాన్య ప్రజలకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఏర్పడ్డాయి.ప్రచార పనులతో రోజువారీ కూలీలకు పనిఎన్నికల ప్రచారంలో ఫ్లెక్సీలు కట్టడం,బ్యానర్లు అమర్చడం,జెండాలు ఏర్పాటు చేయడం,సభా ప్రాంగణాల సిద్ధం వంటి పనులతో రోజువారీ కూలీలకు మంచి డిమాండ్ ఏర్పడింది.ఒకప్పుడు పనిలేక ఖాళీగా ఉన్న వారు ఇప్పుడు ఉదయం నుంచి రాత్రివరకు ప్రచార పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఒక్కో పార్టీ ప్రచారానికి వచ్చే వారికి 200 నుండి 500 వరకు డిమాండ్ ఉండడంతో దీంతో రోజుకు రూ.800 నుంచి రూ.1,500 వరకు ఆదాయం పొందుతున్నామని పలువురు కూలీలు చెబుతున్నారు.

**ఫుల్ జోష్లో యువ ఓటర్లు...**

యువతకు తాత్కాలిక ఉపాధి,రాజకీయ అనుభవం వేములవాడ పట్టణ యువతకు ఈ ఎన్నికలు ఉపాధితో పాటు రాజకీయ అనుభవాన్ని కూడా ఇస్తున్నాయి. ప్రచార వాహనాలు నడపడం,సోషల్ మీడియా ప్రచారం,ఓటర్లతో సంప్రదింపులు, సభల నిర్వహణ వంటి పనుల్లో యువకులు కీలక పాత్ర పోషిస్తున్నారు.కొందరికి ఇది మొదటి ఆదాయ అనుభవంగా మారింది.

**- మహిళలకు పెరిగిన డిమాండ్...**

ముఖ్యంగా ప్రచారం అంటే చాలు మహిళలు జట్టు కట్టుకొని మరి ముందుకొస్తున్నారు. అంతేకాకుండా రోడ్డు షోలకు, ర్యాలీలకు నిలబడే అభ్యర్థులు మహిళలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండడం విశేషం. దీంతోమహిళల పాత్ర పెరుగుతోందనీ చెప్పాలి.ఎన్నికల ప్రచారంలో మహిళల భాగస్వామ్యం ఈసారి మరింత పెరిగింది. ప్రచార భోజనాల వంట, సభల ఏర్పాట్లు,కరపత్రాల పంపిణీ,ఇంటింటి ప్రచారం వంటి పనుల్లో మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారు. దీంతో ఇంటి ఖర్చులకు తోడుగా కొంత ఆదాయం లభిస్తోందని మహిళలు పేర్కొంటున్నారు.



**ప్రింటింగ్, డిజైన్, ఫ్లెక్సీ వ్యాపారాలకు పునర్జీవనం**

వేములవాడలోని ఫోటో స్టూడియోలు,డీటీపీ సెంటర్లు, ప్రింటింగ్ ప్రెస్‌లు ఎన్నికలతో మళ్లీ ఊపిరి పీల్చుకున్నాయి. పోస్టర్ డిజైన్లు, పాంప్లెట్ ప్రింటింగ్, ఫ్లెక్సీ బ్యానర్ల ఆర్డర్లు విపరీతంగా పెరిగాయి. రాత్రివేళల్లో కూడా ప్రెస్‌లు పని చేస్తుండటంతో ఉపాధి అవకాశాలు మరింత విస్తరించాయి. దీనికి తోడు మరికొందరు యువత నిలబడే అభ్యర్థులు వారికి సంబంధించిన రీల్స్ తీస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ కొంత ఉపాధి పొందుతున్నారు.ఇట్టి ప్రచార రిల్స్ మున్సిపల్ ఎన్నికలలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నాయి. అభ్యర్థులు ప్రచారంలో ఏం మాట్లాడింది అన్నది ముఖ్యం కాదు. దాన్ని ఎడిటింగ్ చేసి సోషల్ మీడియాలో బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ తో పోస్ట్ చేసింది ముఖ్యం అన్నట్లుగా తయారయింది మున్సిపల్ ఎన్నికలు.

**రవాణా రంగానికి లాభాల కాలం**

ప్రచార వాహనాల అవసరంతో ఆటోలు, జీపులు, ట్రాక్టర్లు అద్దెకు వెళ్లి రవాణా రంగానికి మంచి ఆదాయం వస్తోంది. డ్రైవర్లు రోజుకు రెండు మూడు ట్రిప్పులతో అదనపు ఆదాయం సంపాదిస్తున్నారు. ఎన్నికల వల్ల రవాణా రంగం మళ్లీ చైతన్యవంతమైంది.

**చిన్న వ్యాపారులకు వరం**

టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, కిరాణా దుకాణాలు ప్రచార బృందాలతో రద్దీగా మారాయి. ప్రచార సభలు జరిగే ప్రాంతాల్లో వ్యాపారం జోరందుకుంది. ఒకవైపు రాజకీయ పోరు సాగుతుండగా, మరోవైపు చిన్న వ్యాపారుల కాసులు చప్పుడు చేస్తున్నాయి.

**తాత్కాలికమైనా కీలక ఉపాధి**

శాశ్వత ఉద్యోగాలు కాకపోయినా... వేములవాడ మున్సిపల్ ఎన్నికలు నిరుద్యోగులకు, పేద వర్గాలకు తాత్కాలికంగా అయినా ఉపాధి కల్పిస్తున్నాయి. ఎన్నికల అనంతరం ఈ ఉపాధి ముగిసినా, ప్రస్తుతానికి ప్రజల జీవనానికి ఇది పెద్ద ఊరటగా మారింది.

**రాజకీయాలకే కాదు... ప్రజల జీవితాలకూ ఎన్నికల ప్రభావం**

వేములవాడ మున్సిపల్ ఎన్నికలు రాజకీయ పార్టీల పోరాటంతో పాటు సామాన్య ప్రజల జీవన విధానాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి. ఓట్ల కోసం జరిగే పోటీ, ఉపాధి రూపంలో ప్రజలకు మేలు చేస్తోందన్న అభిప్రాయం పట్టణంలో వ్యక్తమవుతోంది.

## బండరావిరాల సెక్రటరీపై డిపిఓకు ఫిర్యాదు

**గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న బండరావిరాల గ్రామ కార్యదర్శిపై గ్రామ సర్పంచ్ డిపిఓపి ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ బండరావిరాల గ్రామ పంచాయతీ సెక్రటరీ పి నవనీత రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, రాజకీయ పక్షపాతంతో పనిచేస్తున్న సదరు అధికారిణిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ ను కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామసభ తీర్మానం లేకుండా, ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండానే ఉమామహేశ్వర స్వామి దేవాలయాన్ని దేవాదాయ శాఖలో కలపాలని సెక్రటరీ ఏకపక్షంగా లేఖ ఇవ్వడంపై సర్పంచ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ నుండి వచ్చిన అభ్యంతరాల నోటీసులపై సంతకం చేసి కూడా, గత నెల రోజులుగా ఆ విషయాన్ని నూతన పాలకవర్గానికి తెలియకుండా దాచిపెట్టి సెక్రటరీ మోసపూరితంగా వ్యవహరించారని డిపిఓ దృష్టికి తీసుకెళ్లారు. ఒక దళిత సర్పంచ్‌కు సహకరించకుండా, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న సదరు అధికారిణిని వెంటనే సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సర్పంచ్ ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించిన డిపిఓ సురేష్ మోహన్, ఈ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశిస్తానని, విచారణలో తప్పు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, ఉప సర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్ వార్డు సభ్యులు గుండ్ల భవాని శివ ముదిరాజ్, కన్నె భరత్ యాదవ్, యెడవెల్లి సుష్మిత రాము గుప్తా, ఏర్పుల హరికృష్ణ పాల్గొన్నారు.

## భక్తులకు సాఫీగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలి

**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**వేములవాడ, మహా:** మహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు సాఫీగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో చేస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. ముందుగా వీఐపీ దర్శనాల కోసం చేసిన ప్రత్యేక ద్వారం, బారికేడింగ్ ను పరిశీలించి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయఈ.ఈ ,రాజేస్,కుసూచనలు చేశారు...క్యూ లైన్లు పరిశీలించి, నీటి సదుపాయం ఏర్పాట్లను సందర్శించి ఎక్కువ చోట్ల తాగునీటి పాయింట్లు పెట్టి భక్తులకు అందించాలని సూచించారు. అక్కడి నుంచి నూతన బద్దిపోచమ్మ ఆలయ నిర్మాణ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో స్వామివారి ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కళ్యాణకట్టను పరిశీలించి.. పలు సూచనలు చేశారు. మొబైల్టాయిలెట్లసంఖ్య మరింతపెంచాలనిఆదేశించారు...మహా శివరాత్రి సందర్భంగా స్వామి వారి ఆలయాన్ని పూల అలంకరణతో అందంగా ముస్తాబు చేసి.. జాతరను వైభవంగా నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పార్కింగ్ స్థలం వద్దకోడెలటికెట్కౌంటర్,పందిర్లు,శివార్చనస్టేజీపరిశీలించారు...మహా శివరాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు.పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓ రాధాభాయి, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తదితరులు ఉన్నారు...

## మూడు నెలలుగా తెలుగు టీచర్ కరువు!

- **పలివెల జెడ్పీ పాఠశాలలో మూడు నెలలుగా నిలిచిన తెలుగు బోధన..**
- **అధికారుల ఆదేశాలూ బేఖాతరు విధుల్లో చేరని ఉపాధ్యాయురాలు..**
- **సీఎం పేషీ స్థాయి నుంచి ఒత్తిళ్లు పరీక్షల వేళ విద్యార్థుల ఆందోళన..**
- **నల్గొండ జిల్లా విద్యాశాఖధికారుల నిర్లక్ష్యం**




**మునుగోడు మహా :** అక్కడ అక్షరాలు నేర్పాల్సిన గురువులు రాజకీయాలు నేర్చుకుంటున్నారు, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన అధికారులు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యపు నిద్రలో మునిగిపోయారు. ఫలితంగా మునుగోడు మండలంలోని పలివెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏకంగా మూడు నెలలుగా తెలుగు బోధించే ఉపాధ్యాయుడే లేకపోవడంతో పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల ముంగిట ఆందోళన చెందుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులకే దిక్కులేకుండా పోయిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అసలు వివరాల్లోకి వెళ్తే..గత ఏడాది నవంబర్ 11న పలివెల పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి హనుమాన్ మాల ధరించి రాగా, అక్కడి తెలుగు ఉపాధ్యాయుడు అవమానకరంగా మాట్లాడారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై హిందూ సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున నిరసన తెలపడంతో విద్యాశాఖ సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసింది. అయితే, ఉపాధ్యాయుడిని తొలగించడంలో చూపిన వేగం.. ఆ స్థానంలో మరొకరిని నియమించడంలో విద్యాశాఖ అధికారులు చూపలేదు ఉపాధ్యాయుడి వైఖరిని ప్రశ్నించినందుకే తమ పిల్లలపై వివక్షకు దిగుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**విద్యాశాఖ అధికారులను ఉపాధ్యాయులు లెక్కచేయరా?..**

పలివెల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖధికారులు ఇటీవల కీలక నిర్ణయం తీసుకున్నారు. ముగ్గురు తెలుగు ఉపాధ్యాయులు ఉన్న కొంపల్లి జెడ్పీ పాఠశాల నుంచి ఒకరిని తాత్కాలికంగా పలివెలకు నియామకం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కానీ సదరు ఉపాధ్యాయురాలు మాత్రం పది రోజులు గడుస్తున్నా విధుల్లో చేరలేదు. అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కి ఏకంగా సీఎం పేషీ (CM Peshi) స్థాయి నుంచి పైరవీలు చేయిస్తూ అధికారులను మేనేజ్ చేస్తూ పలివెల పాఠశాలకు హాజరు కావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో సస్పెండ్ అయిన ఉపాధ్యాయుడు ఒక ఉపాధ్యాయ యూనియన్‌లో కీలక నేత కావడంతో, ఆ పాఠశాలకు వెళ్లేందుకు ఇతర ఉపాధ్యాయులు వెనుకాడుతున్నారనే చర్చ నడుస్తోంది. ఉపాధ్యాయ సంఘాల బలం ముందు అధికారుల ఆదేశాలు పని చేయడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

**పరీక్షలు ముంగిట.. సిలబస్ అసంపూర్ణం!**

పదో తరగతి వార్షిక పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. ఇతర పాఠశాలల్లో సిలబస్ పూర్తయి పునశ్చరణ (Revision) జరుగుతుంటే, పలివెలలో మాత్రం తెలుగు పుస్తకాలు తెరిచే దిక్కు లేదు. సిలబస్ పూర్తికాక పాఠాలు చెప్పే వారు లేక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు కళ్లు తెరవాలి..ఉపాధ్యాయుల రాజకీయాల కోసం విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం ఏమాత్రం సమంజసం కాదు. పైరవీలకు లొంగకుండా వెంటనే తెలుగు పంతులును నియమించాలి. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామంటూ విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు..ఇకనైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందిస్తారా? లేక పైరవీలకే తలొగ్గి విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేస్తారా? వేచి చూడాలి.

## వివాదాల్లో శ్రీ గోవిందరాజస్వామి దేవాలయం

- **గోశాల పేరుతో అక్రమ వసూళ్ల పై అర్చకులు మంత్రికి ఫిర్యాదు**
- **న్యాయ విచారణ జరిపించాలని డిసిని ఆదేశించిన మంత్రి**



**వరంగల్ మహా;** హిందూ దేవాలయాల పై ఇటీవల కాలంలో రాజకీయ జోక్యం మితిమీరి పోయింది. కమిటీలు, సంఘాల పేరుతో కొంతమంది నాయకులు ఆలయాలను భ్రష్టు పట్టిస్తూ వాటిని ఆదాయ వనరులుగా మార్చుకొని రాజకీయాలు చేస్తున్నారు. పదేపదే శ్రీ గోవిందరాజస్వామి దేవస్థానాన్ని వివాదాల్లోకి కొంతమంది లాగుతున్నారు. వరంగల్ నగరంలోని అత్యంత ప్రాచీన ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయానికి సంబంధించిన భూముల వ్యవహారం నుండి మొదలుకొని ఆలయ అభివృద్ధి వరకు రాజకీయ పార్టీల కబంధహస్తాలలో చిక్కుకుంది. దీనికి తోడు ఆలయ అర్చకుల మధ్య వివాదాలు కూడా ఆలయ ప్రతిష్టకు బంధం కలిగిస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా మరల శ్రీ గోవిందరాజస్వామి ఆలయానికి చెందిన ఓ వర్గం వారు శుక్రవారంశ్రీ గోవిందరాజ స్వామి దేవస్థానం పాలకవర్గ ఎక్స్ అఫీషియల్ సభ్యులు వరయోగుల లక్ష్మణస్వామి ఆలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి ఆలయ అర్చకులు వరయోగుల మురళీకృష్ణ స్వామి. ప్రసాద్ స్వామి వారి బృందం హన్మకొండ రాంనగర్ లోని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక బృందం మాట్లాడుతూ.. 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్, అతని సోదరుడు చింతాకుల సునీల్ శ్రీ గోవిందరాజస్వామి దేవాలయంలోని అర్చకుల మధ్య గత కొంతకాలంగా విభేదాలు సృష్టిస్తూ ఆలయానికి సంబంధం లేని కొంతమంది అర్చకులను, స్థానికులతో పాటు మహిళా లీడర్లతో గోవిందాద్రి సేవాదళ్ పేరా ఒక అనధికార ట్రస్టును ఏర్పాటు చేసి శ్రీ గోవిందరాజస్వామి దేవస్థానం నందు గోశాల పేరు మీద పెద్ద ఎత్తున చందాలు వసూళ్లు చేస్తూ దేవాదాయ శాఖ అధికారుల నుండి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా అనధికారికంగా గోవిందరాజుల గుట్ట వద్ద గోవులను తీసుకువచ్చి గోశాలను ఏర్పాటు చేశారు. ఈ గోవిందాద్రి సేవాదళ్ పేరిట కొంతమంది సభ్యులు మా పూజా విధి విధానాలను ప్రశ్నిస్తూ అభిషేకాలు, నివేదనలు సాంప్రదాయ పద్ధతిలో జరగడం లేదంటూ మమ్ములను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మేము గత 30 సంవత్సరముల నుండి దేవాదాయ శాఖ ద్వారా ఎటువంటి జీతాలు పొందకుండా భక్తులు ఇచ్చే సంభావనల మీదనే ఆధారపడుతూ మా నిరుపేద కుటుంబాలను పోషించుకుంటున్నాము. సదరు స్థానిక కార్పొరేటర్, అతని సోదరుడు మా గోవిందరాజస్వామి దేవాలయాన్ని ఓ రాజకీయ అడ్డాగా మార్చుకొని రాజకీయాలు చేసుకుంటూ ఆలయ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారు. అంతేకాకుండా అర్చకులమైన మమ్ముల్ని బెదిరిస్తూ భయాందోళనకు గురి చేస్తూ వారి అనుచరుల ద్వారా మమ్ములను చంపు తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ అనధికార ట్రస్ట్ గోవిందాద్రి సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎ రంజిత్ కుమార్, దేవాలయ తాత్కాలిక అర్చకులు వరయోగుల అరుణ్ కుమార్ స్వామిని ముందు పెట్టి వారి ద్వారా గోవిందాద్రి గిరి ప్రదక్షిణ గ్రూపును సృష్టించి దాని ద్వారా మేము ఇది చేస్తున్నామని లేనివి ఉన్నట్టుగా గ్రూప్ లోని సభ్యులను మభ్యపెడుతూ శ్రీ గోవిందరాజస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న గోవిందాద్రి సేవాదళ్ అనే అనధికార ట్రస్ట్ పై దేవాదాయ శాఖ అధికారుల ద్వారా న్యాయ విచారణ చేసి వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మంత్రికి అందజేసిన ఫిర్యాదు పత్రంలో పేర్కొనడం జరిగిందని అర్చక బృందం తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రచార జోరు..

**పరకాలలో ఇంటింటి ప్రచారంతో ప్రజల్లోకి చల్లా ధర్మారెడ్డి**



**మహా పరకాల:** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని బిఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం, అభివృద్ధి లోపాలపై ప్రజలకు వివరించారు. మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం బిఆర్ఎస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 2, 12, 13 వార్డుల బిఆర్ఎస్ అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం



**28వ శాఖను ప్రారంభించిన ప్రముఖ సినీనటి శ్రీలీల**

**వరంగల్ మహా;** 2012లో తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ నగరంలో ప్రారంభమైన మొట్టమొదటి మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది .ఈ క్రమంలోనే హైదరాబాద్ నగరంలోని ఖర్మాన్ ఘాట్ ప్రాంతంలో మాంగళ్య షాపింగ్ మాల్ 28వ శాఖను అత్యంత వైభవంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి శ్రీలీల ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్ లోని వివిధ విభాగాలను సందర్శించి, అక్కడి కలెక్షన్లను పరిశీలించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు మాంగల్య షాపింగ్ మాల్ కు తరలి రావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. అభిమానుల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. రిబ్బన్ కటింగ్ అనంతరం నటి శ్రీలీల మాట్లాడుతూ ,ఖర్మాన్‌ఘాట్ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్ కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం తనకు ఉందని వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ బి నగర్ శాసనసభ్యులు సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నియోజకవర్గం లో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభించినందుకు యాజమాన్యానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతేకాకుండా ఇక్కడి యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కలుగు తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహ మూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు, అన్ని ప్రాంతాల వారికి ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే మా విజయ రహస్యమని తెలిపారు. ముఖ్యంగా మా స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేస్తూ, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నామని పేర్కొన్నారు. అలాగే మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్లతో పాటు, వివాహాలు, వివిధ శుభకార్యాలకు ప్రత్యేకంగా రూపొందించిన భారీ వెడ్డింగ్ కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయని ఈ మాల్ ప్రారంభంతో ఖర్మాన్‌ఘాట్ పరిసర ప్రాంతాల ప్రజలు పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు.ప్రారంభోత్సవం సందర్భంగారూ.99 నుంచి ప్రారంభమై రూ.1 లక్ష వరకు విస్తరించిన ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు.ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో మరో 9 నుంచి 10 కొత్త ప్రాజెక్టులను ప్రారంభించనుందని, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్‌గా ఎదుగుతోందని వారు పేర్కొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా జరగాలి

**ఓటర్లను ప్రలోభపెడితే కఠిన చర్యలు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశం**



**నల్గొండ మహా:** మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా అత్యంత పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర డి.ఐ.జి మహేష్ భగవత్ తో కలిసి ఉమ్మడి నల్గొండ, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అబ్జర్వర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

**నిఘా నీడలో ఎన్నికలు..**

ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం, నగదు పంపిణీపై ఉక్కుపాదం మోపాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డి.ఐ.జి మహేష్ భగవత్ మాట్లాడుతూ..ఫ్లయింగ్ స్క్వాడ్స్ (FST), స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (SST) నిరంతరం నిఘా ఉంచాలి. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయాలని, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచేందుకు ప్రత్యేకంగా 'షాడో టీమ్స్' రంగంలోకి దిగుతాయన్నారు.

**ప్రశాంతంగా పోలింగ్ ఎస్పీ శరత్ చంద్ర పవార్..**

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ నల్గొండ కార్పొరేషన్ సహా 6 మున్సిపాలిటీల్లో మొత్తం 164 ప్రాంతాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 47 రూట్ మొబైల్స్ నిరంతరం పహారా కాస్తాయని ఆయన వివరించారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఓట్ల లెక్కింపు మరియు తదనంతర ప్రక్రియలపై కమిషనర్‌ను అడిగి పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఎన్నికల విధుల్లో ఎక్కడా అలసత్వం వహించకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా సాధారణ పరిశీలకులు రమేష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అభ్యర్థిగా సర్వ వెంకన్న ను గెలిపించండి



**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**తొర్రూరు మహా:** తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డ్ అభ్యర్థిగా టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్వే వెంకన్న ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తో పాటు సతీమణి ఉషా దయాకర్ రావు ఓటర్లను కోరారు. శుక్రవారం తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తూ రెండో వార్డులో అభివృద్ధి పదంలో నడిపించాలంటే సర్వే వెంకన్నను గెలిపించండి మీ వార్డ్ అభివృద్ధి కి వెంకన్న కంకణ బద్ధులై పని చేస్తారని తెలిపారు. గతంలో సర్వే వెంకన్న పోలీస్ గా పని చేశారని విద్యావంతుడని మీ అభ్యర్థి ని గెలిపించుకునే బాధ్యత మీదేనా అని కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎంతో అభివృద్ధి చేశారని ఈసారి సర్వే వెంకన్నను రెండో వార్డులో గెలిపించి అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని కోరారు. విద్యావంతుడైన వెంకన్న మీ కష్ట, సుఖాలకు, మీ కుటుంబ సభ్యుడి వలె పనిచేస్తాడని అతనిని గెలిపించుకొని తొర్రూర్ మున్సిపాలిటిపై టిఆర్ఎస్ జండా ఎగిరేటట్లు చూడాలని ప్రజలను కోరారు. ఉషా దయాకర్లతో పాటు టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మద్దసాని వెంకటేశ్వర్లు, దోనకన కుమార్ స్వామి, అల్లా బాబు, పార్టీ కార్యకర్తలు మహిళా కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి పట్టం కట్టండి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి..

**నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి విస్తృత ప్రచారం..**



**నల్లగొండ మహా ప్రతినిధి:** నల్లగొండ పట్టణ ముఖచిత్రాన్ని మార్చిన ఘనత కేసీఆర్‌దేనని ఈ అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని" మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని 5, 13, 14, 15, 16, 17, 21, 45, 46 డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థుల తరపున ఆయన ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు మంతెన కోటిరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.కంచర్ల భూపాల్ రెడ్డి పర్యటించిన ప్రతి డివిజన్‌లోనూ పండుగ వాతావరణం నెలకొంది. ప్రజలు మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలతో నాయకులకు సాదర స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి తిలకం దిద్దగా స్థానికులు తమ నివాసాల గడపల వద్ద నిలబడి చేతులు ఊపుతూ తమ మద్దతును ప్రకటించారు.

**ఆ నిధులేవి? మళ్లించడంపై నిలదీత..**

సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండను దత్తత తీసుకుని రూ. 1500 కోట్లు వెచ్చించి నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. ఉదయ సముద్రం ట్యాంక్ బండ్, శిల్పారామం, పచ్చల రామ లింగేశ్వర స్వామి,ఛాయా సోమేశ్వరా, వెంకటేశ్వర స్వామి దేవాలయాల అభివృద్ధికి ఐటీ టవర్ రోడ్ల కోసం కేటాయించిన రూ. 300 కోట్లను ప్రస్తుత మంత్రి తన అనుయాయులకు కాంట్రాక్టర్లకు కట్టబెట్టారని ఆరోపించారు.తాను ప్రారంభించిన పనులనే మళ్లీ ప్రారంభిస్తూ తానేదో గొప్పలు సాధించినట్లు మంత్రి ప్రచారం చేసుకుంటున్నారని ప్రజలు వాస్తవాలను గమనించాలని కోరారు.తెలంగాణను తెచ్చిన కేసీఆర్‌ను ఆయన చేసిన అభివృద్ధిని మరిచిపోవద్దని కారు గుర్తుపై ఓటు వేసి నగరపాలక సంస్థపై బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి అని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

# నిబంధనలకు అనుగుణంగా ప్రతి అధికారి విధులు నిర్వహించాలి

**వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలోని నర్సంపేట జెడ్పి సెకండరీ స్కూల్ లో అలాగే వర్ధన్నపేట లోని రైతు వేదికలో మునిసిపల్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం పీఓలు, ఏపీఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి బాధ్యతతో, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ నిర్వహణలో పారదర్శకత, సమర్థత ఎంతో కీలకమని, చిన్న పొరపాటు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు.శిక్షణ అనంతరం నర్సంపేట మునిసిపల్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు వినియోగించే ఎన్నికల సామగ్రిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులు, సీల్స్, బ్యాలెట్ పేపర్లు, రిజిస్టర్లు తదితర సామగ్రి సరైన సంఖ్యలో, సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని కూడా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు అందించాలని, ప్రక్రియ నిబంధనల ప్రకారం, సమర్థంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి అధికారి పూర్తిస్థాయి అవగాహనతో పనిచేయాలని, ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న పీఎంశ్రీ జెడ్పి సెకండరీ స్కూల్ పరిసరాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రధానోపాధ్యాయులు తక్షణమే శుభ్రత చర్యలు చేపట్టి పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, మునిసిపల్ కమిషనర్ భాస్కర్, తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి, ఎన్నికల అధికారులు, మునిసిపల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, పీఓలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

## టిఫిన్ సెంటర్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**వరంగల్ మహా ;** వరంగల్ అండర్ రైల్వే గేటు ప్రాంతం లోని శంభునిపేట, రంగశాయిపేట హోటల్ యజమానులు టిఫిన్ సెంటర్స్ ఓనర్స్ అసోసియేషన్ ను ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం శంభు నిపేట కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో కందికొండ జనార్ధన్ ఆధ్వర్యంలో హోటల్ యజమానులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు విషయాలను చర్చించి టిఫిన్ సెంటర్స్ యజమానులు సంయుక్తంగా అసోసియేషన్ ఏర్పాటు చేయాలనీ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా టిఫిన్ సెంటర్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కందికొండ జనార్ధన్ ప్రధాన కార్యదర్శి చాపల నాగరాజు కోశాధికారి కుసుమ రాజసమ్మయ్య ఉపాధ్యక్షురాలు గోనెల సుజాత ముఖ్య సలహాదారులుగా వెంకటేశ్వర్ రావు, తోట రాజేందర్, అడప రఘు, ఆర్గనైజర్లుగా ఖాదర్, అనిల్, రమేష్, రాజు, సుమన్, మహేష్, వినయ్, వెంకట్రావు, మహేందర్ ఎన్నికయ్యారు.

## బ్రహ్మకుమారిస్ పై ఫిర్యాదు చేసిన రాష్ట్రీయ హిందూ పరిషత్




**వరంగల్ మహా;** రానున్న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని హనుమకొండ చౌరస్తా తో పాటు ఇతర ప్రభుత్వ స్థలాల్లో బ్రహ్మ కుమారి సంస్థ వారు నిర్వహించే స్టాల్స్ కు ఎటువంటి అనుమతులు ఇవ్వకూడదని శుక్రవారం బల్దియా లో రాష్ట్రీయ హిందూ పరిషత్ వారు ఓ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మకుమారి సంస్థ హిందుత్వ విధానాలను అవలంబిస్తుందంటూ ప్రచారం చేస్తూ హిందూ ఆచార వ్యవహారాలను వక్రీకరించడం , శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రధానంగా శివ పరమాత్మను లింగాకృతుల్లో పూజిస్తున్నట్లు చూపెడుతూ శివునికి నానా నామాలలోని ఒక నామమైన అయిన శంకరుడు అను నామమును తీసుకొని శివుడు వేరు శంకరుడు వేరు అంటూ అసలైన పరమాత్మ శివుడు అని ఆ పరమాత్మ ఈ సంస్థ స్థాపించిన లెఖ్రాజ్ బాబా శరీరంలోకి శివుని యొక్క ఆత్మ చేరిందని లేఖ రాజు బాబానే శివుడు అంటూ వక్రీకరిస్తూ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని వారు పేర్కొన్నారు.అంతే కాకుండా హిందూ సాంప్రదాయంలో భార్యాభర్తల బంధానికి విశేష స్థానం ఉందని ఈ బంధం సృష్టి పరిక్రమ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. అలాంటి మనమందరం దేవుని పిల్లలమని భార్యాభర్తల సంబంధాన్ని అన్నా అక్క సంబంధం గా పరిగణిస్తూ ఈ సంస్థలో చేరిన తర్వాత వారి యొక్క మానసిక స్థితిని మార్చి తన భార్యని కూడా అక్కగా సంబోధించి తన భర్తను అన్నగా పిలిచే విధంగా చేస్తూ వాళ్ళ దాంపత్య జీవితాన్ని నాశనం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా యుక్త వయసు గల అమ్మాయిలను మాయ మాటలతో చేర్చుకొని వారి యొక్క వైవాక జీవితాన్ని తుంచి పెడుతూ శివ పరమాత్మ అయిన లేఖ రాజు బాబా కి అర్పితం కావాలని , దాంపత్య జీవనాన్ని ఆ దేవుడు సహించడని మీ కన్యత్వాన్ని దేవునికి అర్పించాలని చెప్పి వారి వైవాహిక జీవితాన్ని దూరం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ హిందూ పరిషత్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మండల భూపాల్ జీ , తెలంగాణ ప్రెసిడెంట్ కోడూరి రాజు జీ , ప్రధాన కార్యదర్శి మడిపోజు సంతోష్ జీ , రణధీర్ రెడీ జీ , పూల రాజు జీ పాల్గొన్నారు.

## రఘునాథ్ పల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**హన్మకొండ మహా;** రఘునాథ్ పల్లి పోలీస్ స్టేషన్ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా, పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి, రికార్డ్ రూమ్, స్టేషన్ రైటర్ రూమ్, రిసెప్షన్ సెంటర్ మరియు ఇతర విభాగాలను తనిఖీ చేసి, వాటిని తగిన విధంగా సంరక్షించుకోవాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరాల రేటు, రోడ్డు ప్రమాదాలు, చోరీ కేసులు, నమోదైన కేసుల పురోగతి పై సీపీ ఆరా తీశారు. అధికారులు, సిబ్బంది పనితీరును మరింత మెరుగు పరుచుకుని చేపట్టాల్సిన విధి విధానాలపై సంబంధిత స్టేషన్ ఎస్ఐ, సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ తగిన సూచనలు చేశారు. ప్రధానంగా ప్రస్తుతం రఘునాథ్ పల్లి మండలం దాని పరిసర ప్రాంతాలలో పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో, ప్రజలను అప్రమత్తం చేసి, ఎటువంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగకుండా ఫారెస్ట్ సిబ్బందితో సమన్వయం చేసుకొని తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీపీ గారు ఆదేశించారు.ఈ సందర్శన కార్యక్రమంలో ఘన్పూర్ ఏసీపీ భీం శర్మ, సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రఘునాథ్పల్లి ఎస్.ఐ నరేష్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వృత్తి ధర్మం చాటుకున్న పోలీసులు

**పోయిందనకున్న బ్యాగ్ దొరికింది.. కృతజ్ఞతలు తెలిపిన మహిళ**



**కూకట్ పల్లి, మహా:** కూకట్‌పల్లి ప్రభుత్వ కళాశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న మహిళ, అధికారిక కార్యక్రమంలో భాగంగా జగద్గిరిగుట్ట పరిధిలోని గాంధీ హైట్స్ వద్ద స్కూటీపై ప్రయాణిస్తున్న సమయంలో ఆమె తన హ్యాండ్ బ్యాగును పోగొట్టుకున్నారు. బ్యాగులో మొబైల్ ఫోన్ ఉండడంతో ఎవరైనా యూపీఐ ద్వారా అకౌంట్‌లోని నగదు విత్ డ్రా చేస్తారేమో అని ఆందోళన చెందారు.ఇదే విషయమై ఆమె జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వెంటనే స్పందించిన జగద్గిరిగుట్ట క్రైమ్ విభాగం పోలీసులు డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ పి. నరేందర్ రెడ్డి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తక్కువ సమయంలోనే తన బ్యాగును గుర్తించి, బాధితురాలికి అప్పగించారు. అయితే బ్యాగ్ లోని మొబైల్ ఫోన్ తో సహా.. తన అకౌంట్ లో నగదుతో పాటు ఇతర విలువైన వస్తువులన్నీ సురక్షితంగా ఉండటంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన జగద్గిరిగుట్ట పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



## నన్ను దీవించి గెలిపిస్తే ఐదు సంవత్సరాలు ఒక సేవకునిగా పనిచేస్తా...

**16వ వార్డ్ బిజెపి అభ్యర్థి గొర్లిల్ల శివలింగం**

**సంగారెడ్డి ప్రతినిధి :మహా:** జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు నన్ను దీవించి గెలిపిస్తే ఐదు సంవత్సరాల పాటు ఒక సేవకురాలుగా పనిచేస్తానని 16వ వార్డు అభ్యర్థి బిజెపి అభ్యర్థి గొర్లిల్ల శివలింగం అన్నారు. శుక్రవారం ఇంటింటి ప్రచారంలో ప్రజలతో వారు మాట్లాడుతూ. పది సంవత్సరాల బిఆర్ఎస్. కాంగ్రెస్ పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని. అభివృద్ధి జాతీయ పార్టీ బిజెపికి సాధ్యమని జరగబోయే ఎన్నికల్లో బిజెపి కమలం పువ్వు గుర్తింపు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. వార్డు అభివృద్ధికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి సహాయ సహకారంతో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తామన్నారు.



## ప్రచారంలో దూసుకుపోతున్న కారు గుర్తు అభ్యర్థి : సతాని శ్రీశైలం

**సంగారెడ్డి ప్రతినిధి : మహా :** పట్టణంలోని 10వ వార్డ్ ప్రజలు నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే వార్డ్అభివృద్ధి తో పాటు ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉండి తన వంతు నిస్వార్ధ సేవలు అందిస్తామని కారు గుర్తు అభ్యర్థి సాతాని శ్రీశైలం శుక్రవారం ఇంటింటి ప్రచారంలో అన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని. ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన కాంగ్రెస్.బాకీ కార్డులను ప్రజలకు తెలియజేస్తూ ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ వార్డు ఇంచార్జ్ శివకుమార్, పార్టీ శ్రేణులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

## వంపుగూడ డివిజన్ కు ప్రభుత్వ ఆసుపత్రి మంజూరు చేయండి

**బీఆర్ఎస్ నేత యాట్ల కృష్ణ**

**కుషాయిగూడ, మహా :** వంపుగూడ డివిజన్ కు ప్రభుత్వ ఆసుపత్రి కేటాయించి ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగి యాట్ల కృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలిక పోరాటాలకు, న్యాయమైన గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. డివిజన్ హోదా లభించినప్పటికీ, ఇప్పటివరకు ప్రజలకు అత్యంత అవసరమైన ప్రాథమిక వైద్య సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోందన్న ఆవేదనను వ్యక్తంచేశారు వేలాది మంది నివసిస్తున్న వాంపుగూడ కాలనీలో ఒక్క ప్రభుత్వ ఆసుపత్రి కూడా లేకపోవడం ప్రజల ఆరోగ్య హక్కులపై జరిగిన తీవ్రమైన నిర్లక్ష్యంగా భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్న అనారోగ్య సమస్యలకే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం వల్ల ప్రజలు ఆర్థికంగా, శారీరకంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందకపోవడం ప్రజల ప్రాణాలకే ముప్పుగా ఆ మారుతుందన్నారు. ప్రభుత్వ అధికారులు ఈ వాస్తవాన్ని తక్షణమే గమనించి, వాంపుగూడ ప్రత్యేక డివిజన్‌కు తగిన గౌరవం కల్పిస్తూ తక్షణమే ఒక ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయాలనిడిమాండ్ చేస్తున్నారు.

## పేద ప్రజల సంక్షేమం వార్డు అభివృద్ధి నా లక్ష్యం...

**మరోసారి ఆశీర్వదించి గెలిపించండి**
**బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి నసీరుద్దీన్**



**సంగారెడ్డి ప్రతినిధి: మహా:** వార్డు పేద సంక్షేమాలు వార్డు అభివృద్ధి ప్రజల నా లక్ష్యమని జరగనున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే వార్డును సుందరంగా తీరుస్తానని వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఎండి నశిరుద్దీన్ శుక్రవారం ఇంటింటి ప్రచారంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ అధినేత కెసిఆర్ పాలనలో పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి 100% అందించిన ఘనత కెసిఆర్ ది అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ఉచిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. కెసిఆర్. పాలనలోనే పట్టణాల అభివృద్ధి పేదల సంక్షేమ పథకాలు పూర్తిగా అమూల్ అయ్యాయని. అమూల్ కాని కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించి జరగనున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ శ్రేణులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గారెడ్డి సహకారంతో వార్డు సమస్యలు పరిష్కరిస్తా ఎనిమిదవ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సిహెచ్ రేణుక శ్రీనివాస్ గౌడ్



సంగారెడ్డి ప్రతినిధి : మహా:

సదాశివపేట పట్టణంలో ఎనిమిదో వార్డులో ఉన్న ప్రజా సమస్యలను ప్రచారంలో భాగంగా తెలుసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి సిహెచ్ రేణుక శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎంత దూరమైనా వెళ్తా, 8వ వార్డులో భూగర్భ జలాలను కాపాడుతా, అవినీతి పరులకు తగిన బుద్ధి చెబుతా, ఎనిమిదో వార్డులో ఎనిమిదవ వార్డు ప్రజల అండదండలతో వారి సమస్యలను పరిష్కరించి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తా ఈ గెలుపు ఎనిమిదో వార్డు ప్రజలదే అని తెలియజేశారు. ప్రచారంలో భాగంగా ఎనిమిదవ వార్డు ఇంచార్జ్ చింటూ గౌడ్ మాట్లాడుతూ 8వ వార్డు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తూచా తప్పకుండా కాంగ్రెస్ అనుసరించి, శ్రీ తూర్పు జయప్రకాష్ రెడ్డి గారి అండదండలతో ఎనిమిదో వార్డు అభివృద్ధిని సాధిస్తామని తెలియజేశారు. 8వ వార్డు ప్రజల ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలియజేశారు. అదేవిధంగా ఎనిమిదవ వార్డు ప్రజలు సిహెచ్ రేణుక శ్రీనివాస్ గౌడ్ గారిని అఖండ విజయంతో గెలిపిస్తామని సంతోషంతో వ్యక్తం చేయడం ఎంతో ఆనందదాయకంగా ఉందని తెలియజేశారు. ఈ యొక్క ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీశైలం, నవాజ్, వసీం, షరీఫ్, రజాక్, మరియు కాంగ్రెస్ పార్టీ మహిళామూర్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకే సాధ్యం...

**10వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి**



**సంగారెడ్డి ప్రతినిధి : మహా:** అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకే సాధ్యం అని 10వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కంది నరసింహాగౌడ్ శుక్రవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూజరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉండి తమ వంతు నిస్వార్థ సేవలు అందిస్తామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు , వార్డు సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## 8వ వార్డ్ అభివృద్ధికి కృషి చేస్తా...

**కారు గుర్తు కొత్త గొల్ల సోమశేఖర్**



**సంగారెడ్డి ప్రతినిధి :మహా:** పట్టణంలోని 8వ వార్డు అభివృద్ధికి అన్నివిధాలుగా కృషి చేస్తానని ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొత్తగొల్ల సోమ శేఖర్ కుమార్ కోరారు . శుక్రవారం వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని. జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాటలకు మోసపోవద్దన్నారు. నన్ను ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు

## బిజెపికి ఒకసారి అవకాశం ఇవ్వండి




**ఎంపి రఘునందన్ రావు**

**సంగారెడ్డి ప్రతినిధి: మహా :** సదాశివపేట మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు ఓటు వేసి పట్టణ అభివృద్ధికి బిజెపికి ఒకసారి అవకాశం ఇవ్వాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన రావు కోరారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బిజెపి పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థుల ప్రచారంలో భాగంగా శుక్రవారం సదాశివపేట పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభకు మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘునందన్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో కౌన్సిలర్లకు రోడ్లు, డ్రైనేజీ పనుల్లో కమీషన్లపై ఉన్న ధ్యాస పట్టణ అభివృద్ధిపై లేదని ఎద్దేవా చేశారు.ఓట్ల కోసం వస్తే బీఆర్ఎస్ వారిని చెరువుల వద్దే సాగనంపాలని ప్రజలను కోరారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. అధికారులు కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తల్లాగా పని చేయడం మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి పార్టీ ఎన్నికల ఇన్చార్జ్ జయశ్రీ, బిజెపి నాయకులు నాయకులు రాజేశ్వర రావు దేశ్పాండే, సంగమేశ్వర్, మాణిక్ రావు , తోట చంద్రశేఖర్ ,శ్రీశైలం యాదవ్, కే శ్రీనివాస్ , కర్ణం ఆదిత్య, కౌన్సిలర్ అభ్యర్థులు,మహిళలు, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి,డబ్బును అంతం చేయండి!

- నీతివంతమైన ఓటు వేయండి!
- నేరేడుచర్ల మున్సిపాలిటి ఎన్నికలలో 6వ వార్డు జనరల్ స్వతంత్ర బిసి అభ్యర్థిగా పిల్లలమర్రి వెంకటేశ్వర్లు.
- కెమెరా గుర్తు కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలి




**హుజూర్ నగర్ మహా:** నేరేడుచర్ల మున్సిపాలిటీ 6వ వార్డు అమ్మ అక్క, చెల్లెళ్ళకు మరియు పెద్దలకు అన్నదమ్ముళ్ళకు పిల్లలమర్రి వెంకటేశ్వర్లు జనరల్ స్వతంత్ర బిసి అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి నేరేడుచర్ల పట్టణంలో వుంటూ వెనుకబడిన తరగతుల కోసం పోరాటాలు చేస్తూ మీ ముందుకు వస్తున్న పిల్లలమర్రి వెంకటేశ్వర్లు. అవినీతి అంతం మన చేతిలోనే ఉంది. అక్రమంగా డబ్బు సంపాదించి డబ్బును పంపిణి చేసి ఓటు విలువను దెబ్బ తీస్తున్న బడా బాబులను ఓడించి ఓటు విలువను కాపాడుకుందాం. మన 6వ వార్డు ఓటర్లు ఈ మార్పు తెస్తారని నోటు కాదురా ఓటు గొప్పదని, డబ్బు, మద్యం ఇంకా ఎన్నో ప్రలోబాలకు గురి చేస్తున్న నాయకులకు బుద్ధి చెప్తారని ఈ రాష్ట్రానికే 6వ వార్డు ఆదర్శంగా నిలవాలని మనతోనే అవినీతి అంతం కావాలని కోరుతూ మీకు ఎప్పుడు అందుబాటులో ఉండే తనను గెలిపిస్తారని ఆశిస్తున్నానన్నారు 42 శాతం బిసి రిజర్వేషన్లు కలిపిస్తానన్న రేవంత్రెడ్డి కాంగ్రెస్ సర్కార్ మోస పూరిత రాజకీయం చేస్తూ బిసిలను రాజకీయంగా మరియు అన్ని రంగాలలో ఎదగనివ్వకుండా చేస్తున్న కాంగ్రెస్, బిజెపి, బి.ఆర్.ఎస్ ఈ పాలక పార్టీలు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి అవినీతి పరులను పోషిస్తూ నోట్లు పంచి ఓట్ల రాజకీయం చేస్తూ అందిన కాడికి దండుకొని ధనవంతులు అవుతున్నారు. బిసి, ఎస్సి, ఎస్టి మైనారిటి మరియు వెనుకబడిన ప్రజలను ప్రలోబాలకు గురి చేస్తూ మోసం చేస్తున్నారు. ఈ మోసాన్ని పటాపంచెలు చేద్దాం రా కదలిరండి.... బిసి, ఎస్టి, ఎస్సి, మైనారిటీ,వెనుకబడిన తరగతుల ఐక్యత వర్ధిల్లాలి. 6వ వార్డు స్వతంత్ర అభ్యర్థి (పిల్లలమర్రి వెంకటేశ్వర్లు బిసి) అయిన తన గుర్తు "కెమెరా" కు గుర్తుకే మీ నీతివంత మైన ఓటు వేసి గెలిపించగలరని ఓటర్ల లను ఆయన కోరుతున్నారు.




## స్థానిక సమస్యలపై మంత్రికి వినతి పత్రం

**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని లేబర్ కాలనీకి విచ్చేసిన మంత్రి కొండా సురేఖ ను 23వ డివిజన్ స్థానిక ప్రజలు కలిసి ఆటోనగర్ మసీదు ఎదురుగా ఉన్న చిన్న గల్లీ లో మురుగు నీరు ఇండ్లలోకి వెళ్లి దుర్గంధం వెదజల్లుతూ ఇళ్లలోకి మురికి నీరు చేరడంతో విష జ్వరాలతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి తెలియజేస్తూ ఈ సమస్యల పై వినతి పత్రం అందజేయగా స్పందించిన మంత్రి రోడ్లు డ్రైనేజీని వెంటనే సాంక్షన్ చెయ్యాలని కమీషనర్ కు ఆదేశాలు ఇస్తూ లెటర్ ఇవ్వడం జరిగిందని చిప్ప వెంకటేశ్వర్లు నేత 23 వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తెలిపారు.

## త్యాగాలు లేకుండా రాష్ట్రం వచ్చిందా

**సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు**

**భువనగిరి, మహా:** అనేక పోరాటాల తోటి బలిదానాల తోటి త్యాగాల తోటి రాష్ట్రాన్ని సాధించి పెడితే భోగాలు అనుభవిస్తున్నది ఎవరు త్యాగాలు లేకుండా వారికి పదవులు ఎక్కడివి అని మలిదశ ఉద్యమకారుడు టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ ఆరోపించారు ఇవ్వాలా మీరు భోగాల అనుభవిస్తూ పదవులు అనుభవిస్తున్నారంటే ఉద్యమకారులు త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ రాష్ట్రంలో కనీసం ఉద్యమకారులు కూడు గూడు కు నోచుకోని పరిస్థితి ఏర్పడదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం నెలరోజుల లోపు వెంటనే ఉద్యమకారుల గుర్తించ దానికి జ్యుడిషి యల్ కమిటీని వేయాలని గుర్తించాలని ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు

## 7న దేశ వ్యాప్త సమ్మె

**ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్ల నిర్ణయం**

**కుషాయిగూడ, మహా:** కనీస ఛార్జీలు, డ్రైవర్ల పని పరిస్థితుల మెరుగుదల వంటి డిమాండ్లతో ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్లు ఫిబ్రవరి 7న దేశవ్యాప్తంగా సమ్మెకు దిగనున్నారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్‌తో పాటు పలు కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈ సమ్మె నిర్వహించనున్నారు.కనీసం ఆరు గంటల పాటు డ్రైవర్లు సేవలను నిలిపివేసి నిరసన వ్యక్తం చేస్తారని సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈ సమ్మె ప్రభావంతో దేశవ్యాప్తంగా క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశముంది.

## ట్రాఫిక్ రూల్స్ కు చిన్నారుల స్వరం


**రాధిక చౌరస్తాలో అవగాహన కార్యక్రమం**

**కుషాయిగూడ, మహా :** రాధిక చౌరస్తాలో గౌతమ్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో చిన్న పిల్లలతో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ లింగారెడ్డి, ఏఎస్ఐ నర్సింలు మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల చేత ప్రజలకు ట్రాఫిక్ రూల్స్ ప్రాధాన్యతను వివరించారు. ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎలా పాటించాలి, రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనదారులు నియమాలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.చిన్న వయసులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా తయారవుతారని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం రాధిక చౌరస్తాలో వచ్చిన ప్రజలను ఆకట్టుకుని ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎంవీ శేషు కుమారి, పి పి టి ఇంచార్జ్ శ్వేతా రెడ్డి, టీచర్లు అశ్విని, రష్మీ, సహాన, ఉషా, కోమల్, జితేందర్, నరేష్, పీఈటీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## సదాశివపేట 26వ వార్డులో బిజెపి ప్రచార జోరు

**సంగారెడ్డి ప్రతినిధి :మహా:** సదాశివపేట లో స్థానిక ఎన్నికల ప్రచారంలో బాగం గా బిజెపి 26వ వార్డు అభ్యర్థి దుబుడం మమత సుదానందం ప్రచారం లో దూసుకెళ్తున్నారు . శుక్రవారం కార్యకర్తలతో కలిసి ప్రచారం ప్రారంబించారు.,ఈ సందర్భంగా 26 వ వార్డు అభివృద్ధికి అన్నివిధాలా ఏ సమస్యలు ఉన్న కేంద్ర ప్రభుత్వ అండదండలతో, మోడీ నాయకత్వంలో, Mp రఘునందన్ రావు, ఎంఎల్‌సి అంజి రెడ్డి సహాయ సహకారాలతో వార్డు అభివృద్ధికి క్రుషి చేస్తానని అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి అదేవిధంగ మహిళ సాదికారత కోసం అమలు చేస్తున్న పథకాలు, అవలంబిస్తున్న అబివృద్ధి కార్యక్రమలను ఇంటింటి ప్రచారం లో బాగాంగా మరో సారి ఓటర్లకు గుర్తు చేశారు



## హైదరాబాద్ రియల్ ఎస్టేట్..
# పెరిగిన ఇళ్ల ధరలు

భారతదేశ గృహ రియల్ ఎస్టేట్ రంగంలో 2025లో ధరల పెరుగుదల గణనీయంగా మందగించింది. దేశంలోని టాప్ ఎనిమిది నగరాల్లో ఇళ్ల సగటు ధరలు 2025లో కేవలం 6 శాతం మాత్రమే పెరిగాయి. కాగా 2024లో ఈ వృద్ధి 17 శాతంగా నమోదైంది. ఈ విషయాన్ని ప్రాప్‌టైగర్ విడుదల చేసిన 'రియల్ ఇన్‌సైట్ - రెసిడెన్షియల్ CY 2025' నివేదిక వెల్లడించింది. అయితే, అమ్మకాలు తగ్గినప్పటికీ, సరఫరాపై నియంత్రణ, ధరల స్థిరత్వం కారణంగా గృహ మార్కెట్ బలహీనపడలేదని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాలు డిమాండ్‌ను నిలుపుకొంటూ స్థిరమైన ప్రదర్శన చూపించాయి.

**హైదరాబాద్‌లో 8 శాతం ధరల వృద్ధి**

2025లో హైదరాబాద్‌లో గృహాల సగటు ధరలు 8 శాతం పెరిగాయి. ఇది బెంగళూరుతో కలిసి దేశంలోనే మెరుగైన పనితీరు చూపిన మార్కెట్లలో ఒకటిగా హైదరాబాద్‌ను నిలిపింది. ఐటీ, సేవా రంగాల ఆధారంగా ఉన్న ఎండ్‌యూజర్ డిమాండ్ హైదరాబాద్ మార్కెట్‌కు ప్రధాన బలం అని నివేదిక తెలిపింది. ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ధరలు ఇంకా అందుబాటులో ఉండటం, మెరుగవుతున్న రహదారి మౌలిక సదుపాయాలు, కొత్త నివాస కారిడార్ల అభివృద్ధి కూడా డిమాండ్‌ను నిలబెట్టిన కీలక కారణాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. స్పెక్యులేటివ్ కొనుగోళ్ల కంటే స్వయంగా నివసించేందుకు కొనుగోలు చేసే వారి వాటా ఎక్కువగా ఉండటం మార్కెట్‌కు స్థిరత్వాన్ని ఇచ్చింది.

**బెంగళూరు ముందంజ**

దేశంలోని టాప్ ఎనిమిది నగరాల్లో బెంగళూరు 13 శాతం ధరల పెరుగుదలతో అగ్రస్థానంలో నిలిచింది. 2025 చివరి త్రైమాసికానికి బెంగళూరులో చదరపు అడుగుకు సగటు ధర రూ.9,500కు చేరి, ఢిల్లీఎన్‌సీఆర్ (రూ.9,167)ను దాటి దేశంలో రెండో అత్యంత ఖరీదైన గృహ మార్కెట్‌గా అవతరించింది. మొదటి స్థానంలో ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (రూ.14,000) ఉంది. ఇతర నగరాల్లో ధరల వృద్ధి పరిమితంగానే నమోదైంది. ముంబై ఎంఎంఆర్‌లో 4 శాతం, ఢిల్లీఎన్‌సీఆర్, కోల్‌కతాల్లో 6 శాతం, అహ్మదాబాద్‌లో 8 శాతం పెరుగుదల కనిపించింది. పుణేలో కేవలం 1 శాతం, చెన్నైలో ఎలాంటి పెరుగుదల లేకపోవడం గమనార్హం.

**అమ్మకాలు, సరఫరాలో తగ్గుదల**

2025లో దేశవ్యాప్తంగా గృహ అమ్మకాలు 12 శాతం తగ్గి 3.86 లక్షల యూనిట్లకు పరిమితమయ్యాయి. ఇది 2022 తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి. కొత్త గృహ ప్రాజెక్టుల ప్రారంభాలు కూడా 6 శాతం తగ్గి 3.61 లక్షల యూనిట్లకు చేరాయి. అయితే, 2025 చివరి త్రైమాసికంలో సరఫరా స్వల్పంగా మెరుగుపడింది. Q4లో కొత్త లాంచ్‌లు 4 శాతం పెరగడం డెవలపర్లలో మెల్లగా విశ్వాసం పెరుగుతున్న సంకేతంగా నివేదిక పేర్కొంది. హైదరాబాద్‌లో సరఫరా నియంత్రితంగా ఉండటంతో ఇన్వెంటరీ ఒత్తిడి తక్కువగానే కొనసాగింది.

**2026పై అంచనాలు**


ప్రాప్‌టైగర్ నివేదిక ప్రకారం, హైదరాబాద్, బెంగళూరు వంటి ఎండ్‌యూజర్ ఆధారిత నగరాలు 2026లోనూ స్థిరమైన ప్రదర్శన కొనసాగించే అవకాశముంది. పరిమిత సరఫరా, నియంత్రిత ఇన్వెంటరీతో గృహ రంగం ముందుకు సాగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. "అమ్మకాలు తగ్గినప్పటికీ ధరల స్థిరత్వం కొనసాగుతోంది. డెవలపర్లు స్వయంనియంత్రిత సరఫరాతో ధరల సమగ్రతను కాపాడుతున్నారు" అని ఆరమ్ ప్రాప్‌టెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఓంకార్ షెట్టి పేర్కొన్నారు.

# అమెజాన్ 200 బిలియన్ డాలర్ల పెట్టుబడి!




కృత్రిమ మేధస్సు (AI), రోబోటిక్స్, కస్టమ్ చిప్స్, లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ వంటి సాంకేతిక రంగాల్లో.. అమెజాన్ దాదాపు 200 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ ఖర్చు అంతకుముందు ఏడాదితో పోలిస్తే.. 50 శాతం కంటే ఎక్కువ కావడం గమనార్హం. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ యాజమాన్యంలోని.. ది వాషింగ్టన్ పోస్ట్ తన ఉద్యోగులలో దాదాపు మూడింట ఒక వంతు మందిని తొలగించాలని తన నిర్ణయాన్ని వెల్లడించిన ఒక రోజు తర్వాత ఈ భారీ పెట్టుబడికి సంబంధించిన ప్రకటన వచ్చింది. కాగా సంస్థ నాల్గవ త్రైమాసిక ఆదాయం 14 శాతం పెరిగినట్లు వెల్లడించింది. పెట్టుబడికి సంబంధించిన విషయాలను గురించి.. అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీ మాట్లాడుతూ, ఈ ఖర్చు ప్రధానంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ (AWS) కోసం ఉపయోగిస్తామని తెలిపారు. AWS అనేది సంస్థలు, ప్రభుత్వాలు, మొబైల్ యాప్స్‌కు క్లౌడ్ సేవలు అందించే విభాగం. ఇది సంస్థను ఏఐ రంగంలో అగ్రగామిగా నిలబడటానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఇదే సమయంలో, ది వాషింగ్టన్ పోస్ట్ తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటోంది. పత్రిక మొత్తం ఉద్యోగుల్లో సుమారు 30 శాతం.. అంటే 300 మందికి పైగా జర్నలిస్టులను తొలగించింది. ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ మ్యాట్ ముర్రే ప్రకారం.. పత్రిక చాలాకాలంగా నష్టాల్లో నడుస్తోంది. అందుకే ఈ ఉద్యోగాల తొలగింపు తప్పనిసరి అయిందని ఆయన చెప్పారు. భవిష్యత్తులో పత్రిక జాతీయ వార్తలు, రాజకీయాలు, వ్యాపారం, ఆరోగ్యం వంటి అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టనుంది. కాగా క్రీడలు, పుస్తకాలు వంటి విభాగాలను పూర్తిగా మూసివేయనుంది.. రోజువారీ పాడ్‌కాస్ట్ 'పోస్ట్ రిపోర్ట్స్' కూడా నిలిపివేయనుంది.

# ఆర్‌బీఐ కీలక నిర్ణయం
## వారికి పరిహారంగా రూ.25 వేలు!




టెక్నాలజీ పెరుగుతున్న సమయంలో సైబర్ నేరాలు కూడా ఎక్కువవుతున్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టడానికి బ్యాంకులు ప్రజలలో అవగాహన పెంచుతున్నాయి. దీనికోసం బ్యాంకింగ్ సంస్థలు ప్రత్యేకంగా సైబర్ ఫ్రాడ్ ప్రొటెక్షన్ ప్లాన్స్ కూడా తీసుకొస్తున్నాయి. సైబర్ ఇన్స్యూరెన్స్‌లు కూడా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి సమయంలో.. సైబర్ మోసాలకు బాధితులవుతున్న వారికి అండగా నిలిచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) కీలక ప్రకటన చేసింది. గవర్నర్ సంజయ్ మల్హోత్రా ద్రవ్య విధాన కమిటీ (MPC) సమావేశం ముగింపు రోజున ఈ ప్రకటన చేశారు. వినియోగదారుల రక్షణలో భాగంగా.. డిజిటల్ మోసాల వల్ల నష్టపోయిన కస్టమర్లకు తక్షణ ఆర్థిక సాయంగా గరిష్ఠంగా రూ.25,000 వరకు పరిహారం చెల్లించనున్నట్లు ఆర్‌బీఐ ప్రతిపాదించింది. త్వరలో దీనికి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించి విడుదల చేయనున్నారు. డిజిటల్ చెల్లింపులు వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో, ఇలాంటి చర్యలు ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


### ఇలాంటి సమయాల్లో
## పరిహారం..

**బ్యాంకింగ్ సంస్థల నిర్లక్ష్యం లేదా సిస్టం లోపల వల్ల ప్రజలు సైబర్ నేరాలకు గురైతే.. రిజర్వ్ బ్యాంక్ పరిహారం అందించనుంది. అంతే కాకుండా.. చిన్న మొత్తంలో నష్టపోయినవారికి మాత్రమే ఈ పరిహారం అందించడం జరుగుతుంది. భారీ మొత్తంలో సైబర్ మోసాలకు గురైనప్పుడు.. ఈ పరిహారం లభించదు. ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ బీఎల్‌ఎస్ ఈ సర్వీసెస్ సీఎఫ్ఓ రాహుల్ శర్మ.. చిన్న మోసాల వల్ల కలిగే నష్టాలకు ఈ పరిహారం కొంత ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. వెల్స్ ఫార్గో మాజీ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ గ్లోబల్ బ్యాంకింగ్ లీడర్ సంతాను సెంగుప్తా కూడా ఈ నిర్ణయాన్ని డిజిటల్ ఫైనాన్షియల్ ఎకోసిస్టమ్‌లో విశ్వాసాన్ని పెంచుతుందని వెల్లడించారు.**



## ఒప్పో
# కొత్త స్మార్ట్ ఫోన్..
## ధర ఎంతంటే?

స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో ఇండియా తాజాగా రెనో 15సీ ఫోన్‌ని ఆవిష్కరించింది. ట్రావెలర్లు, క్రియేటర్లు, ఫొటోగ్రఫీపై మక్కువ గల వారి కోసం దీన్ని తెచ్చినట్లు తెలిపింది. ఇందులో 7000 ఎంఏహెచ్ బ్యాటరీ, 80వాట్స్ సూపర్‌వూక్ ఫాస్ట్ చార్జింగ్, 6.57 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 50 ఎంపీ అల్ట్రా క్లియర్ మెయిన్ కెమెరా, తదితర ఫీచర్లు ఉన్నాయి. ధర రూ. 34,999 నుంచి ప్రారంభమవుతుంది. ఒప్పో రెనో 15c ఫిబ్రవరి 5 నుంచి భారతదేశంలో కొనుగోలుకు అందుబాటులో ఉంది. ఇది ఆఫ్టర్‌గ్లో పింక్ & ట్విలైట్ బ్లూ అనే రెండు రంగు ఎంపికలలో లభిస్తుంది. 8GB RAM & 256GB స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 34,999 కాగా.. 12GB RAM & 256GB స్టోరేజ్ మోడల్ ధర రూ. 37,999. ఇది అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఒప్పో ఆన్‌లైన్ స్టోర్, ఆఫ్‌లైన్ రిటైల్ అవుట్‌లెట్‌ల ద్వారా అమ్మకానికి ఉంది. కెమెరాల విషయానికొస్తే.. రెనో 15c 50MP మెయిన్ రియర్ కెమెరా, 8MP అల్ట్రా వైడ్ కెమెరా, 2MP మాక్రో సెన్సార్‌తో వస్తుంది. ముందు భాగంలో 50MP అల్ట్రావైడ్ సెల్ఫీ కెమెరా ఉంది. ఈ ఫోన్ ముందు & వెనుక కెమెరాలలో 4K వీడియో రికార్డింగ్‌కు సపోర్ట్ చేస్తుంది.



# దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



# కశ్మీరీలకు మద్దతుగా పాక్‌లో ర్యాలీలు



**ఇస్లామాబాద్:** కశ్మీరీ ప్రజలకు సంఘీభావంగా గురువారం పాకిస్తాన్ వ్యాప్తంగా ర్యాలీలు జరిగాయి. జమ్మూకశ్మీర్ సమస్యకు పరిష్కారం కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, ఐరాస భద్రతా మండలి తీర్మానాలను అమలు చేయడమేనని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు. కశ్మీర్ సాలిడారిటీ డేను పురస్కరించుకుని ముజఫరాబాద్‌లోని పీవోకే అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. కశ్మీర్ పాకిస్తాన్‌లో భాగంగా మారనుందన్నారు. పాకిస్తాన్ వ్యవస్థాపకుడు జిన్నా ప్రకటించిన విధంగానే దేశ విదేశాంగ విధానానికి కశ్మీరే ప్రాతిపదికగా ఉంటుందని తెలిపారు. కశ్మీర్ అంశాన్ని పాలస్తీనాతో ముడిపెట్టిన షెహబాజ్ షరీఫ్ ఈ సందర్భంగా హతులైన ఉగ్రవాదులు బుర్హాన్ వనీ, సయ్యద్ అలీ జిలానీ వంటి వారి పేర్లను ప్రస్తావించారు. అనంతరం సరిహద్దుల్లోని ఫార్వర్డ్ పోస్ట్‌ను సందర్శించి, సైనికులతో మాట్లాడారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ ఆసిమ్ మునీర్, అధ్యక్షుడు జర్దారీ కూడా కశ్మీర్ ప్రజలకు సంఘీభావం తెలిపారని ప్రభుత్వం వెల్లడించింది. సదస్సులు, సమావేశాలతోపాటు ఉదయం 10 గంటల సమయంలో దేశవ్యాప్తంగా ఒక నిమిషం మౌనం పాటించినట్లు ప్రభుత్వ రేడియో వెల్లడించింది.

# అమెరికా పవర్‌ఫుల్ కంట్రీ.. ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశం అమెరికా అంటూ ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికా రక్షణ రంగాన్ని ఎప్పుడూ లేని స్థాయిలో బలోపేతం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో న్యూ స్టార్ట్ అణు ఆయుధ నియంత్రణ ఒప్పందంపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా సోషల్ మీడియా ట్రుత్ వేదికగా స్పందిస్తూ..'అమెరికా ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశం. నా ఫస్ట్ టర్మ్‌లోనే మిలిటరీని పూర్తిగా అత్యున్నతంగా తీర్చిదిద్దాను. కొత్త అణ్వాయుధాలు అభివృద్ధి చేశాం. పాత వాటిని రీఫర్బిష్ చేశాం. దేశ రక్షణ రంగాన్ని ఎప్పుడూ లేని స్థాయిలో బలోపేతం చేస్తున్నామన్నారు. అమెరికా సైనిక శక్తి, అణ్వాయుధ సామర్థ్యం గొప్పది. అమెరికా స్పేస్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం మా ప్రభుత్వ పెద్ద నిర్ణయం. అంతరిక్ష భద్రతను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ చర్య అమెరికా రక్షణ వ్యవస్థను మరింత బలపరిచింది. భవిష్యత్ యుద్ధాలు భూమి మీదే కాకుండా అంతరిక్షంలోనూ జరుగుతాయని, అందుకే స్పేస్ ఫోర్స్ కీలకం' అని పేర్కొన్నారు.

**యూఎస్ నౌకా దళంపై..**

నౌకాదళ విభాగంపై కూడా ట్రంప్ ప్రత్యేకంగా మాట్లాడారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో సేవలందించిన ఐవా, మిస్సోరీ, అలబామా వంటి యుద్ధనౌకల కంటే 100 రెట్లు శక్తిమంతమైన ఆధునిక బ్యాటిల్‌షిప్‌లను నిర్మిస్తున్నామని తెలిపారు. సముద్ర రక్షణను మరింత పటిష్టం చేయడమే తమ లక్ష్యమన్నారు.

**భారత్, పాక్‌పై పాత పాటే..**

ఇక అణు యుద్ధాల అంశంపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తి రేకెత్తించాయి. భారత్‌పాకిస్తాన్, ఇరాన్ ఇజ్రాయెల్, రష్యా ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యే సమయంలో అణు ఘర్షణలు తలెత్తకుండా తానే జోక్యం చేసుకుని ఆపానని తెలిపారు. అయితే యుద్ధాలకు సంబంధించి స్పష్టమైన వివరాలు మాత్రం ఇవ్వలేదు. అదేవిధంగా దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో కూడా ట్రంప్ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించడంలో అమెరికా మధ్యవర్తిత్వం చేసిందని చెప్పారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు గత ఏడాది నుంచి కృషి చేస్తున్నానని, అర్మేనియా అజర్‌బైజాన్ మధ్య దీర్ఘకాల ఘర్షణను కూడా పరిష్కరించానని పేర్కొన్నారు.

**అణు నియంత్రణపై..**

ఇక న్యూ స్టార్ట్ అణు ఆయుధ నియంత్రణ ఒప్పందంపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం సరైన విధంగా చర్చించకుండా కుదిరిందని, అమెరికాకు అనుకూలంగా లేదని విమర్శించారు. అంతేకాకుండా ఇది ఉల్లంఘనలకు గురవుతోందని ఆరోపించారు. దీనిని పొడిగించడానికి బదులుగా కొత్త, మెరుగైన, ఆధునిక ఒప్పందాన్ని రూపొందించాలని సూచించారు. ఈ నేపథ్యంలో అమెరికా అణు నిపుణులు కలిసి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త ఒప్పందం రూపొందించాలని ట్రంప్ అభిప్రాయపడ్డారు. దీర్ఘకాలిక భద్రతను కల్పించే విధంగా సమగ్ర అణు నియంత్రణ వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు.



# 200 భారత వెబ్‌సైట్లను సీజ్ చేసిన అమెరికా

**న్యూయార్క్:** అనుమతి లేని, ప్రమాదకరమైన ఔషధాలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న భారత్‌కు చెందిన 200కు పైగా వెబ్‌సైట్‌లను స్తంభింప జేసినట్లు అమెరికా ఫెడరల్ అధికారులు తెలిపారు. ఇవన్నీ భారత్ కేంద్రంగా పనిచేసే ఓ నేర సంస్థకు చెందినవని చెప్పారు. ఈ సంస్థ సరఫరా చేసిన ఔషధాలను వినియోగించి ఆరుగురు చనిపోగా, నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారన్నారు. ఆన్‌లైన్‌లో అదేవిధంగా, యూఎస్ డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ (డీఈఏ) బృందాలు 'ఆపరేషన్ మెల్ట్‌డౌన్'లో భాగంగా దేశవ్యాప్తంగా సోదాలు జరిపి నలుగురిని అరెస్ట్ చేశాయని పేర్కొన్నారు. డ్రగ్స్ ముఠాలతో చేతులు కలిపిన ఆన్‌లైన్ ఫార్మసీ వెబ్‌సైట్లు సరైన ప్రిస్క్రిప్షన్లు లేకుండానే ప్రమాదకరమైన ఫెంటానిల్ వంటి వాటితో కూడిన కల్తీ మందులను అంటగడుతున్నాయన్నారు. ఈ వెబ్‌సైట్లు అమెరికాకు చెందినవిగా కనిపించేందుకు తప్పుడు చిరునామాలను ఇస్తున్నాయన్నారు.

# పాక్‌లో పేలుడు.. 50మంది మృతి?




**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లో మరోసారి ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. రాజధాని ఇస్లామాబాద్‌లో పేలుడు సంభవించి 50 మందికి పైగా మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. గాయపడిన బాధితుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం మసీదు వద్ద పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. బాంబు పేలుడుతో రాజధానిలో ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించినట్లు పాక్ ఆంగ్ల మీడియా డాన్ తెలిపింది. డాన్ మీడియా వివరాల ప్రకారం.. రాజధాని ఇస్లామాబాద్‌లో షహజాద్ టౌన్ ప్రాంత మజీద్‌లో రక్తం ఏరులై పారింది. పేలుడు దాటికి మజీద్‌లో 50మంది ప్రాణాలు కోల్పాయారు. 80మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు తీవ్రతను బట్టి మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పేలుడుపై సమాచారం అందుకున్న పోలీసులు.. గాయపడ్డ క్షతగాత్రుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సహాయక చర్యల్ని ముమ్మరం చేశారు. మజీదులో పేలుడు ఘటనపై రంగంలోకి దిగిన బాంబు స్క్వాడ్ టీం ఇది ఆత్మాహుతి దాడా? లేదంటే బాంబుల్ని అమర్చారా? అన్న కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇస్లామాబాద్‌లో పేలుడు ఘటన జరగడం రెండోసారి. అంతకుముందు నవంబర్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో 12మందికిపైగా గాయపడ్డారు. ఇటీవల పాకిస్థాన్ ఆర్మీ, బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు, కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఇరు వర్గాలు తీవ్రంగా గాయపడ్డాయి.

# పాక్ ఆర్మీ అరాచకం.. బలూచిస్తానీల ఊచకోత




**ఇస్లామాబాద్:** కల్లోలిత బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న ఆపరేషన్‌లో కనీసం 216 మంది ఉగ్రవాదులు హతమయ్యారని పాకిస్తాన్ ఆర్మీ గురువారం తెలిపింది. మరో 22 మంది భద్రతా సిబ్బంది, మహిళలు, చిన్నారులు కలిపి 36 మంది పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారంది. రాద్ ఉల్ ఫిత్నా-1 పేరుతో జనవరి 26వ తేదీన చేపట్టిన ఈ ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని తెలిపింది. ఉగ్రవాద బృందాల నాయకత్వాన్ని, పోరాట పటిమను తీవ్రంగా దెబ్బకొట్టామని, కమాండ్ కంట్రోల్ వ్యవస్థలను ధ్వంసం చేశామని పేర్కొంది. గత ఐదు రోజులుగా నిలిపివేసిన రైళ్ల రాకపోకలను గురువారం నుంచి తిరిగి అధికారులు మొదలుపెట్టారని వెల్లడించింది. ఇరాన్, అఫ్గానిస్తాన్, పాకిస్తాన్ సరిహద్దులను కలిపే ఈ ప్రావిన్స్‌లో బలూచ్ వేర్పాటువాద గ్రూపులు చురుగ్గా పని చేస్తున్నాయి. ఇదిలా ఉండగా.. బలూచిస్థాన్ వేర్పాటువాదులు చేతుల్లో పాక్ సైన్యానికి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. బలోచ్ లిబరేషన్ ఆర్మీ రెబల్స్‌కు పాక్ సైన్యం ఎదురు నిలబడి పోరాడలేని పరిస్థితి నెలకుంది. ఈ విషయాన్ని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్వయంగా అంగీకరించడం గమనార్హం. బలూచిస్థాన్ ప్రావిన్సుల్లో రెబల్స్‌ను ఎదుర్కొనలేక తమ సైన్యం చేతులెత్తేసిందని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బలూచ్ లిబరేషన్ ఆర్మీతో ఎటువంటి చర్చలు ఉండబోవని అసిఫ్ తేల్చిచెప్పారు. మహిళలు, చిన్నారులు సహా పౌరులను చంపుతోన్న ఉగ్రవాదులతో చర్చలు ప్రసక్తేలేదని పాక్ రక్షణ మంత్రి ఉద్ఘాటించారు. నేరస్థులకు, వేర్పాటువాద గ్రూపులకు మధ్య సంబంధం ఉందని, బీఎల్ఏ బ్యానర్ కింద నేర ముఠాలు పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అఫ్గానిస్తాన్, ఇరాన్‌తో సరిహద్దులు పంచుకునే బలూచిస్థాన్ ప్రావిన్సుల్లో దశాబ్దాలుగా వేర్పాటువాద ఉద్యమం కొనసాగుతోంది. పాక్ పాలన కింద తాము ఉండబోమని, ప్రత్యేక స్వయం ప్రతిపత్తి కోరుకుంటున్నారు.



# మహా పత్రిక







## ఉదయ్‌పూర్‌లో పెళ్లి

### 26న విజయ్–రష్మికల వివాహం

గత ఏడాది అక్టోబరులో విజయ్ దేవరకొండ – రష్మికా మందన్నాల నిశ్చితార్థం జరిగినప్పట్నుంచి వీరి వివాహ తేదీ ఎప్పుడు? అనే విషయంపై చర్చ మొదలైంది. ఈ నెల 26న ఈ ప్రేమికులు... భార్యాభర్తలు కానున్నారు. రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్ వీరి పెళ్లికి వేదిక కానుంది. ఇంకా 20 రోజులే ఉన్నందున ఇటు విజయ్ అటు రష్మిక కుటుంబ సభ్యులు జోరుగా పెళ్లి పనులతో బిజీగా ఉన్నారు. ఇరువైపు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ పెళ్లి జరగనుంది. అలాగే హైదరాబాద్‌లో మార్చి 4న సినీ, రాజకీయ ప్రముఖులు, ఇతర సన్నిహితుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయాలనుకుంటున్నారని సమాచారం. ఇక గతంలో 'గీత గోవిందం, డియర్ కామ్రేడ్' చిత్రాల్లో విజయ్–రష్మిక జంటగా నటించిన సంగతి గుర్తుండే ఉంటుంది. తాజాగా వీరి కాంబినేషన్‌లో మూడో సినిమాగా 'రణబాలి' రూపొందుతోంది. ఈ చిత్రం సెప్టెంబరు 11న విడుదల కానుంది.



## ఈ దెయ్యంతో ఇట్టే ప్రేమలో పడతారు

**జాగ్రత్త... ఈ సినిమాలో దెయ్యం ఉంది, ఇదో హారర్ సినిమా. అయినా కంగారుపడకుండా సరదాగా సకుటుంబ సపరివార సమేతంగా చూడదగ్గ సినిమా సర్వం మాయ. హారర్ సినిమా అంటే దెయ్యం, అస్థిపంజరం, స్మశానం... ఇవే ఇప్పటి ప్రేక్షకులకు గుర్తుకు వచ్చే తరుణంలో దర్శకుడు అఖిల్ సత్యన్ ఓ మాయ చేసి ఈ సర్వం మాయ హారర్ సినిమాలోని దెయ్యాన్ని చూసే ప్రేక్షకులు కూడా ఇష్టపడేట్టు చేశాడు. నిజానికి ఇది ఓ గొప్ప ప్రయోగమనే చెప్పాలి. ఆ ప్రయోగంలో దర్శకుడు పూర్తిగా విజయం సాధించాడు. అంతలా ఏముందో ఈ సినిమాలో ఓ సారి చూద్దాం.**

సర్వం మాయ ఓ మళయాళ సినిమా. ఈ సినిమాలో కథానాయకుడైన ప్రబేందు స్వతహాగా నాస్తికడైనా కుల వృత్తి ప్రకారం అర్చకాలు, పూజా పునస్కారాలు చేస్తూ ఉంటాడు. అంతేకాదు ప్రబేందు మంచి గిటారిస్టు కూడా. ప్రబేందు తన బంధువైన రూపేష్ బలవంతం చేయడంతో అనుకోకుండా ఓ రోజు దెయ్యం వదిలించే పూజను ఒప్పుకుంటాడు. ఆ పూజలో తాను వదిలించిన దెయ్యం తననే పట్టుకుంటుంది. ఇక అక్కడ నుండి కథ రసరంజకంగా సాగుతుంది. దెయ్యం అంటే ఆషామాషి దెయ్యం కాదు. ఆ దెయ్యాన్ని చూస్తే ప్రేక్షకులు కూడా తమకూ అలాంటి దెయ్యం కనిపిస్తే బాగుండునని అనుకోక మానరు. అన్నట్టు ఆ దెయ్యానికి ఓ పేరు కూడా ఉంటుంది అదే డెలలూ.

ఈ కథలో ప్రబేందును కలిసిన ఆ డెలలూ చేసే అల్లరి, చిలిపితనం ప్రేక్షకులను బాగా అలరిస్తాయి. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే ఆ డెలలూ తాను ఎవరినో, ఎందుకు చనిపోయి దెయ్యం అయిందో అన్న సమాధానం కోసం వెతుకుతూ ప్రబేందుని పట్టుకుంటుంది. మరి ఆ డెలలూ ఆచూకీ కనిపెట్టడంలో ప్రబేందు డెలలూకి సాయపడతాడా, అలాగే ఆ డెలలూ వల్ల ప్రబేందుకి కలిగిన ఇబ్బందులు ఏంటి అనేవి మాత్రం హాట్ స్టార్ వేదికగా తెలుగులోనూ స్ట్రీమ్ అవుతున్న సర్వం మాయ చూడాల్సిందే.

ఈ సినిమా కాస్త నెమ్మదిగా ప్రారంభమైనా దెయ్యం వచ్చినప్పటి నుండి మహా సరదాగా సాగిపోతుంది. కాకపోతే క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను కాస్త కన్ఫ్యూజన్‌లో పడేస్తుంది. ఏది ఏమైనప్పటికీ ఈ సినిమా మొత్తం డెలలూ కోసం ఓసారి చూడాల్సిందే. ఇంకెందుకాలస్యం వీకెండ్ హాట్ స్టార్ ట్యూన్ చేసి డెలలూతో జత కట్టండి.

## ప్రేక్షకుల డబ్బుకి విలువ ఇస్తాను: గుణశేఖర్



''లాఠీ' (1992) చిత్రంతో చిత్ర పరిశ్రమకి వచ్చాను. 'యుఫోరియా' నా 14వ సినిమా. నా మొదటి చిత్రానికి ఎలా ఫీల్ అయ్యానో ఇప్పుడు కూడా అదే ఫీల్‌తో ఉన్నాను. నేను ప్రేక్షక దేవుళ్లని నమ్ముతాను. వారి సమయం, డబ్బు, విజ్ఞతకు విలువ ఇస్తాను. ఈ మూడింటిని దృష్టిలో పెట్టుకుని ఒళ్లు దగ్గర పెట్టుకుని 'యుఫోరియా' తీశాను. ఈ మూవీ వల్ల వారి టైమ్, మనీ... ఏదీ వృథా కాదు'' అని డైరెక్టర్ గుణశేఖర్ తెలి పారు. భూమిక ప్రధాన పాత్రలో సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత, పృథ్వీరాజ్ నటించిన చిత్రం 'యుఫోరియా'. గుణశేఖర్ దర్శకత్వంలో రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మించారు. ఈ మూవీ నేడు విడుదల అవుతోంది. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్ లో గుణశేఖర్ మాట్లాడుతూ– ''ఈ సినిమాకి భూమిక బ్యాక్ బోన్. వింధ్య వేములపల్లి పాత్రలో తను జీవించింది'' అన్నారు. భూమిక మాట్లాడుతూ– ''యుఫోరియా' సినిమా చూశాను. అర్ధరాత్రి ఒంటి గంట, రెండు గంటల సమయంలో లేచి నా పాత్ర గురించే ఆలోచించాను (భావోద్వేగంతో)'' అని పేర్కొన్నారు. ''మా సినిమా అందరి మనసుల్ని తాకుతుందని భావిస్తున్నాను'' అని నీలిమ గుణ చెప్పారు.



## అభిమానానికి ధన్యవాదాలు : శివకార్తికేయన్

ప్రముఖ హీరో శివకార్తికేయన్ ఇటీవల నటించిన చిత్రాలన్నీ కమర్షియల్‌గా మంచి విజయాన్ని సాధిస్తున్నాయి. అదే సమయంలో మంచి కంటెంట్‌తో కూడిన చిన్న చిత్రాలకు తన నిర్మాణ సంస్థ ద్వారా విడుదల చేస్తూ చేయూతనిస్తున్నారు. శివ కార్తికేయన్ తాజాగా కథానాయకుడిగా నటించిన పరాశక్తి చిత్రం కమర్షియల్ గా మంచి విజయాన్ని అందుకుంది. దీంతో ఈయన తదుపరి చిత్రానికి సిద్ధమవుతున్నారు. చేతిలో ప్రస్తుతం వెంకట్ ప్రభు దర్శకత్వం వహించనున్న చిత్రంతో పాటు కమలహాసన్ నిర్మించనున్న మరో ప్రాజెక్ట్ ఉంది. వాటిలో ఏది ముందు సెట్స్‌పైకి వెళుతుందో అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇలాంటి సమయంలో తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుచ్చిలోని కుమారస్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం శివ కార్తికేయన్ మీడియాతో ముచ్చటించారు. 14 ఏళ్ల సినిమా జీవితం తనకు చాలా అందించిందని పేర్కొన్నారు. ఈ ప్రయాణంలో ఎన్నో కష్టాలతో పాటు పోరాటాలు చేయాల్సి వచ్చింది. కానీ, అభిమానులు చూపించే ప్రేమాభిమానాలు వాటన్నింటినీ మరిచిపోయేలా చేసింది. నా కుటుంబంపై అలాంటి అభిమానాన్ని కురిపిస్తున్న అందరికీ ధన్యవాదాలు అని శివకార్తికేయన్ పేర్కొన్నారు. కాగా తిరుచ్చిలో కుమారస్వామి ఆలయంలో దిగిన ఫొటోలను ఆయన సతీమణి ఆర్తి ఎక్స్ మీడియాలో పోస్ట్ చేశారు. అవి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

## కలసిరాని లక్

**నోరా ఫతేహి ఐటం సాంగ్ స్పెషలిస్ట్. దిల్‌బర్ సాంగ్‌తో సెన్సేషన్ సృష్టించింది. శరీరాన్ని రబ్బర్‌లా సాగదీస్తూ, విల్లులా వంచుతూ స్టెప్పులేయడంలో ఆమె దిట్ట. తన ఎనర్జీకి, అందానికి చాలామంది ఫ్యాన్స్ ఉన్నారు. నేడు (ఫిబ్రవరి 6న) ఆమె 34వ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం..**

### కెరీర్


నోరా ఫతేహి కెనడా నటి. కెనడాలోని టోర్నటోలో పుట్టిపెరగడంతోపాటు అక్కడే చదువుకుంది. రోర్ (2014) సినిమాతో నటిగా బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. ఆ మరుసటి ఏడాది టెంపర్ సినిమాలో ఇట్టాగే రెచ్చిపోదాం పిల్లా.. అనే ప్రత్యేక పాటలో అదరగొట్టింది. అక్కడినుంచే తన ఐటం సాంగ్స్ జర్నీ మొదలైంది. బాహుబలి మూవీలో 'మనోహరి..' అంటూ ప్రభాస్‌ను చుట్టుముట్టేసే సాంగ్‌తో మరింత ఆదరణ పొందింది.

### నటిగా కలిసిరాని అదృష్టం


తెలుగులోనే కాకుండా తమిళ, హిందీ, మలయాళ భాషల్లోనూ ఐటం సాంగ్స్ చేసింది. అయితే తనకు నటిగా కనిపించాలన్న కోరిక ఎక్కువ. అలా రెండేళ్లుగా ఐటం సాంగ్స్‌పై ఫోకస్ తగ్గించేసి యాక్ట్రెస్‌గా సినిమాలు చేస్తోంది. తెలుగులో మట్కా సినిమా చేయగా ఇది అట్టర్ ఫ్లాప్ అయింది. ఇక్కడే కాదు హిందీలోనూ తను నటించిన సినిమాలు పెద్దగా విజయవంతం కాకపోవడంతో నటిగా బ్రేక్ రావడం లేదు. దీంతో మళ్లీ గతేడాది చివర్లో థామా మూవీలో స్పెషల్ సాంగ్‌లో కాలు కదిపింది.

### బిగ్‌బాస్ షోలోనూ..

నోరా డ్యాన్సర్, నటి మాత్రమే కాదు, సింగర్ కూడా! ప్రస్తుతం నోరా ఫతేహి.. కన్నడలో కేడీ: ద డెవిల్, తమిళంలో కాంచన 4 సినిమాలు చేస్తోంది. మరి వీటితోనైనా బ్రేక్ వస్తుందేమో చూడాలి! నోరా ఫతేహి.. హిందీ బిగ్‌బాస్ 9వ సీజన్‌లోనూ పార్టిసిపేట్ చేసింది. డ్యాన్స్ ఐకాన్‌గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ జలక్ దిక్‌లాజా 9వ సీజన్‌లో కంటెస్టెంట్‌గా అడుగుపెట్టింది. ఆ తర్వాత ఇదే షోకి జడ్జిగా వ్యవహరించడం విశేషం.



## చెక్‌బౌన్స్ కేసులో తీహార్ జైలుకు కిక్2 నటుడు



కిక్2 సినిమాతో తెలుగువారికి పరిచయమైన బాలీవుడ్ నటుడు రాజ్‌పాల్ యాదవ్ తీహార్ జైలు అధికారుల ముందు లొంగిపోయారు. చెక్‌బౌన్స్ కేసులో నటుడికి ఢిల్లీ హైకోర్టు ఆరు నెలలు శిక్ష విధించింది. కానీ, గడువు పెంచాలని పలుమార్లు కోరుతూ కొంత కాలంగా ఆయన కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో కోర్టు ఆగ్రహం చేయడంతో తప్పనిపరిస్థితిల్లో తీహార్ జైలు అధికారుల ముందు లొంగిపోయారు. బాలీవుడ్ నటుడు రాజ్‌పాల్ యాదవ్, అతడి భార్య రాధపై ఢిల్లీకి చెందిన మురళీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ 2017లో చెక్ బౌన్స్ కేసు పెట్టింది. రాజ్‌పాల్ యాదవ్ తమ వద్ద రూ.5 కోట్లు తీసుకొని తిరిగి ఇవ్వడం లేదని సంస్థకు చెందిన ఎం.జి.అగర్వాల్ రికవరీ కేసు పెట్టాడు. వారు ఇచ్చిన బ్యాంక్ చెక్‌లు కూడా బౌన్స్ అయ్యాయని ఢిల్లీ కోర్టును ఆశ్రయించడంతో రాజ్‌పాల్ దంపతులను 2018లోనే దోషులుగా న్యాయస్థానం తేల్చింది. ఈ క్రమంలో రాజ్‌పాల్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. అయితే, ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి ఫిర్యాదుదారుడికి తిరిగి డబ్బు చెల్లిస్తానని స్టే తెచ్చుకున్నారు. కానీ, న్యాయస్థానం ముందు ఆయన చేసిన వాగ్దానం ప్రకారం డబ్బు తిరిగి చెల్లించలేదు. దీంతో ఢిల్లీ కోర్టు కూడా సీరియస్ అయింది. తీహార్ జైలు అధికారుల ముందు హాజరు కావాలని జారీ చేసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com